# హంపీ కన్యలు

హంపీ అంటావా? చూశాను. ఎందుకా? చరిత్రాత్మకమైన స్థలాలు చూడ్డం నాకు సరదాలేని మాట నిజమే. కాని అంత దగ్గిరలో వున్నానే, ఏదో అంతా గొప్ప గొప్ప అని గోలపెడుతున్నారు అని వెళ్ళాను. అదీ గాక పద్మనాభం నెల రోజుల్నించి హంపీ కలవరింపు తప్ప యింకేంలేదు. అతను చదివినవన్నీ నాకు చూపాలని అతని ఆశ. నేను రానంటే, తన మామగారు పోయినదానికన్న యెక్కువ దిగులుపడతారు. ప్రయాణం సరదా. క్షేత్ర మహత్యమూ? నాకు అదివరకు నమ్మకం లేకపోయినా, అక్కడికి వెళ్ళింతరవాత గొప్ప నమ్మకం కుదిరింది. అక్కడి గాలే అదేదో కొత్త ఉత్సాహాన్నిస్తుంది. పూర్వం వాళ్ళకి వీర్యాన్నిచ్చిందట. ప్రస్తుతం ఆ గుణానికే సాఫల్యాన్ని చేకూరుస్తుంది. ఉత్త వీర్యంవుంటే యేం చేసుకోను ? కొద్దో గొప్పో అందరికీ వుంటుంది. ఆ వీర్యం ఎక్కడ ఎట్లా సఫలమౌతుంది అనే ప్రశ్నే యిన్ని కథలు కల్పిస్తోంది - నిజమైనవి, అబద్ధమైనవీ.

నేనూ, పద్మనాభమూ, అతని భార్య రాజేశ్వరీ, అతని పిల్లలూ వెళ్ళాము. వెంట వచ్చిన స్టూడెంట్లు సదుపాయాలన్నీ చూస్తున్నారు. మాకు పద్మనాభం వెంట తిరగడంతప్ప పనేంలేదు. ఆ వూరు చేరినప్పణ్నించి అతను మా లోకంలో లేడు. కృష్ణదేవరాయలతో చేరిపోయినాడు. ఈనాడు మళ్ళీ విజయనగర సామ్రాజ్యం స్థాపించి, అష్టదిగ్గజాల ప్రతిభని ప్రతిష్ఠించాలని సిన్సియర్‌గా కలలు కంటాడు. ఒక్కొక్క దృశ్యమే మాకు చూపి లెక్చర్లు కొడతాడు. అతని "ఎక్స్‌ట్రా ఎనర్జీ"నంతా యే విధివల్లనో భరించవలసిన సహజ ప్రాప్తి ఆ భార్యకూ పిల్లలకూ రాసివుంది. ఆ నాల్గునాళ్ళూ అది నా నెత్తిన కూడా పడ్డది.

"గొప్ప విజయనగర సామ్రాజ్యం యిట్లా రాళ్ళపాలై పోతే! మీకు కొంచెం చుట్టూ తిరిగి చూడడానికి కూడా బద్ధకమైపోయిందే, పాపం, ఆ రాజులు, మంత్రులు, ఆంధ్రరాజులు, ఆంధ్రమంత్రులు, సేనానులు, రాణులు, అందరూ మట్టిపాలైనాసరే! మీరు మాత్రం కొంచెం....."

"అయితే మాత్రం నేను తిరిగితే వాళ్ళకేం లాభం? చచ్చిన వాళ్ళు-"

"అదికాదు, నీ కంతమాత్రం దేశాభిమానం లేదే అని నా దిగులు"

"నా కళ్ళలో లేదు" అంటాను.

రాజేశ్వరి నవ్వి. ఏ బండమీదో కూలబడి కదలనంటుంది-నా మాటల ఆసరా చూసుకుని. నేనే లేకపోతే, ఆమెని తిప్పి, తిప్పి, ఆంధ్ర దెయ్యాన్నిగా తయారు చేసేవాడే అతను.

"ఈ రాయివుందే, యిక్కడే తిమ్మరుసు మంత్రి ఆ యుద్ధంనాటి సాయంత్రం యోచిస్తో కూచున్నాడు. ఆంధ్ర సామ్రాజ్య పురోభివృద్ధీ, ఆంధ్రవాఙ్మయ...."

"ఈ రాయికాదు, ఆ రాయిమీద కూచుని వుంటాడు" అన్నాను.

"నీ కెట్లా తెలుసు?"

"బుద్ధి వున్నవాడెవడూ ఈ రాయిమీద కూచోడు. ఎంత యేటవాలుగా వుందో చూడు"

"ఈ రాయే సీవెల్ రాశాడు. ఆ కాలంలో ఏటవాలుగా లేదేమో. ఆ మొండి విగ్రహం-అరే పిల్లలూ, మీరన్నా వినండి-ఈవిగ్రహం పదమూడేళ్ళ పద్నాలుగు రోజులు చెక్కారు. రాజేశ్వరీ, ఏమిటి మీరు యిద్దరూ అట్లా నవ్వుతారు? నిజం, కాదనా? ఇంటికి పద, చదివి వినిపిస్తాను"

ఈ రాళ్ళన్నీ వర్ణించుకుంటో తిరక్కపోతే-

కాని, అతనికి రాళ్ళల్లో మందిరాలూ, విగ్రహాల్లో వాఙ్మయాలూ, గాలిలో మృతుల కంఠాలూ గోచరిస్తున్నాయి.

కాని అట్లా తిరక్కపోతే, యే కొండ నీడలోనో శాంతంగా కూచుని తళ తళలాడు తుంగభద్ర నీళ్ళవంకా, చుట్టూ నీలంగా యెర్రగా రంగులు మారే కొండలువంకా చూస్తో ఆనందించకూడదా ?

వొప్పుకోడు. ఇంకా యేదో మహల్ అట, భోగం వీధిట......చంపుతున్నాడు. "అక్కడ బోగం దెయ్యమన్నా వుండదే! ఎందుకు వెళ్ళడం?" అంటాను.

చెరుకుతోట చూసి, ఇక్కడే ముక్కు తిమ్మన్నకి 'గండపెండేరం తొడిగా'రన్నాడు. జొన్నచేలో రాణిగారు జలక్రీడ లాడిందని వూహించుకోమంటాడు. రాళ్ళగుట్ట చూపి, ఇదే రామరాజు తాలింఖానా అన్నాడు. ఇంక రామాయణం మీద పడి, రుష్యమూకమూ, సీత చీరా అంటో వుండగా నేను వినడం మానేశాను. సాయంత్రం నాలుగయింది. "ఇక్కడే సుగ్రీవుడు, ఆ కొండమీదనే రాముణ్ణి చూసింది" అన్నాడు.

నా గుండె ఆగింది. ఆ కొండ యెక్కమనేటట్టున్నాడు.

పద్మనాభం ముందు నేను వోడిపోదలుచుకోలేదు. ఆడది కనక రాజేశ్వరి మొండికెత్తింది.

"ఇక్కడే సీత ఒక్క అడుగు ముందుకు కదలనన్నది" అని రాజేశ్వరి ఒక బండమీద కూలబడ్డది.

ఆమె విషయమై సమస్తమైన హెూప్సు పోయిన వాడివలె చూశాడు పద్మనాభం.

"పాపం, ఆమెకి సహాయం వుండాలని అన్నాడు లక్ష్మణుడు" అని నేను కూలబడ్డాను.

"యు టూ బ్రూటస్" అన్నట్టు వెనక్కి పడ్డాడు పద్మనాభం.

"లవకుశులు" అంటున్నారు పిల్లలు.

"లవకుశుల పిర్రలమీద తగిలిస్తాడు రాముడు" అన్నాడు పద్మనాభం.

ఆంధ్రాభిమానం యింజన్ పొగలు కక్కుతో పనిచేస్తోంది, అతని పొట్టలో.

పిల్లలు బిక్క మొహాలేసుకొని మా వంక యీర్ష్యతో చూస్తున్నారు.

"మీరన్నా ఆంధ్రా యూనివర్సటీ యిక్కడికి తీసుకురావాలి. వైస్‌ఛాన్సలర్ బంగాళా కట్టించవలసిన చోటు చూపుతాను రండి-"

అంటో ఆ నిర్భాగ్యుల్ని వెంట వేసుకుని కొండ నెక్కుతున్నాడు.

"కొండమీద వైస్‌ఛాన్సలర్‌కి నీళ్లెట్లా?" అంటున్న వాళ్ళప్రశ్నకి సమాధానం చెప్పలేక తడబడే అతని మాటలు దూరమై వినపడుతున్నాయి. మంచు శిఖరాల మీదనించి వీస్తున్నట్టు వొస్తోంది గాలి. రాళ్ళమధ్యన యెట్లానో సందు లేర్పరుచుకొని రంగు రంగుల పూలు తలలూపుతున్నాయి. మా వెనక గంభీరమైన పర్వతం, ముందు వంకర్లు తిరిగే దారి, మా మీద చల్లని నీడ, పైన చిక్కని నీలపుటాకాశం, దూరంగా రంగులు మారే మైదానం-ఆ నున్నని బండలమీద నిద్రపోవాలి. మరణిస్తే అక్కడే పాతేయించుకోవాలనిపించింది. ఇద్దరమూ మాటలూ, ఆలోచనలూ లేని గాఢసుషుప్తిలో పడ్డాము. మృత్యువంటే యిట్లానే వుంటే!

ఇంగ్లీషు మాటలు తేలి వొచ్చాయి గాలిలో-ఒకటి స్త్రీకంఠం కూడాను. నా చెవులు నిక్కపొడిచాను. కృష్ణదేవరాయల అంతఃపురంలో ఇంగ్లీషు వనితలు వుండేవారేమో!

సూట్లు వేసుకుని యిద్దరు యువకులూ, నవీన గౌను ఫాషన్లలో చీరెలు కట్టుకుని యిద్దరు యువతులూ వస్తున్నారు. ఒకడు బాగా పొడుగు. ఒక కంటికి అద్దం తగిలించి హంపీని నవీనంగా పరిశీలిస్తున్నాడు. రెండోవాడు దూలమంత చుట్టతో హంపీ రాళ్ళకి, నవాబులు రెణ్ణాళ్ళు కాల్చిన హుక్కా పొగల జ్ఞాపకం తెప్పించి, వొణుకును పుట్టిస్తున్నాడు.

నన్నూ, నా వాలకాన్నీ, నా సాధారణ దుస్తుల్నీ చూడగానే పొడుగాటివాడి ఒంటి కన్ను తృణీకారంగా నిరాకరించింది. క్రమంగా రాజేశ్వరి మీదికి ఆమె సిల్కు జాకెట్టు మీదికీ "స్టయిలిష్" జుట్టుముడి మీదికీ జరిగి కొంచెంగా వొప్పుకుంది. ఆమె పక్కన వున్న వాటర్‌బోటిల్ మీద నిలిచి పెద్దగా తెరుచుకుంది, అతని కన్ను. బోటిల్ పద్మనాభం ఆమె పక్కన పెట్టిపోయినాడు. ఎప్పుడు ఏ నిమిషాన ఏ వస్తువు అవసరం వస్తుందోనని అనేక వస్తువులు సిద్ధంచేసి వుంచుతాడు అతను. కత్తెర, కాయితం, నీళ్ళు, కత్తి, అగ్గిపెట్టె, దూది, కలం, కఱ్ఱ యిత్యాదులు. అవెప్పుడూ అతనికి అవసరం రాగా నేను చూడలేదు. ఏదీ వెంటతెచ్చుకోని నాకే వాటి అవసరం ఎక్కువ. అవసరం తీర్చుకుని వాటిని పాస్ చేస్తాను యింకోరికి. అతను గోల.

"ఆ బుడ్డిలో నీళ్ళేనా?" అని ఆ కొండరాళ్ళని అడిగాడు ఇంగ్లీషులో. నేను కొండలవంక చూశాను, ఏం జవాబు చెపుతాయోనని.

"మిమ్మల్నేనండి! ఆ బాటిల్లో నీళ్ళా?"

"కాదు, సిరా."

ఆడవాళ్ళిద్దర్లో ఒకామె బాగా తెల్లగా వుంది. ఆమె పకపక నవ్వింది. రాళ్ళన్నీ పాతజ్ఞాపకాలతో ఝల్లుమన్నాయి.

"ఎందుకు నవ్వుతావు!" అని ఆమెని కళ్ళతో బలహీనంగా అదమాయించి "ఈమెకి దాహంగా వుంది" అని తన బూడ్సులతో చెప్పుకున్నాడు.

"ఆశ్చర్య మాశ్చర్యము!" అన్నాను నేను నాటకంలోవలె.

"దాంట్లో నీళ్ళువుంటే వెంటనే ఇయ్యి" అన్నాడు అధికారంగా నావంక చూస్తూ. రాజేశ్వరి బుడ్డి బిరడా తియ్యబోతోంది.

"ఆగు, ఆయన కంఠం విని నీళ్ళు వొణుకుతున్నాయి" అన్నాను ఇంగ్లీషులోనే.

మళ్లీ తెల్లపిల్ల నవ్వింది, యెర్ర నవ్వుతూన్న అతని మొహం వంక చూస్తూ. నవ్వువిని వానకురిసినట్టు పువ్వులు ముఖాలెత్తి చూశాయి.

"అదృష్టవంతులు. హాయిగా కూచున్నారు. అబ్బా! ఈ పాడుబూడ్సులు!" అంటో రాజేశ్వరి పక్కన కూచుని విప్పేస్తోంది ఆ తెల్లనిపిల్ల.

"ఎందుకు వేసుకున్నారు?" అన్నాను.

"ఎందుకా? నా-ఆయన వున్నారే-ఆయన-" అని ఆపుకోలేక నవ్వింది. ఇంక కొంచెం నవ్వితే రాళ్ళన్నీ పువ్వులుగా పగిలేవే.

"ఈ విగ్రహాలూ, రాళ్ళూ, ఆకాశమూ బూడ్సులు లేనివాళ్ళని క్షమించవుట" అంది.

పాడుగాటి ఆయన వొంటి అద్దంలోంచి నిప్పులుచూస్తున్నాడు ఆమె వంక.

నీళ్లందిచ్చాను నవ్వే ఆమె పెదవులకు. తాగి, నాకు అర్థంకాని భాషలో ఏదో అంది వాళ్లతో. ఆ ఠీవి మానికూచోమని అంటున్నట్టు తోచింది నాకు.

రెండో యువతి-యీ గోలంతా యేమిటి, యీ మనుషులెవరు, యీ ఆగడమెందుకు? అన్నట్టు విసుగుతో చూస్తోంది. రెండో ఆయన ఆకాశాన్ని ధూమంతో నింపే పనిమీద నిమగ్నుడై వున్నాడు.

వాళ్ళు కొంచెం ముందుకి నడిచి ఆకాశానికీ మాకూ, కోతులకూ తమకూ యేమీ సంబంధంలేదని మబ్బులకూ, రాళ్ళకూ తెలిసేట్టుగా కూచుంటున్నారు. జేబుల్లోంచి, చేతి సంచుల్లోంచి, చేతి రుమాళ్ళు తీసి నున్నని కొండల్ని దులిపారు ముందుగా. నాకు లవండరు వాసన కొట్టింది.

"ఆ రాళ్ళని మురికి చెయ్యకండి" అన్నాను దగ్గిరిగావున్న నవ్వులపిల్లకి మాత్రమే వినపడేటట్టు.

"ఆ కొండల్ని కడగకండానే భోజనం చెయ్యవొచ్చు, కొంచెం దూరంలో నదివొడ్డున చెక్కిన రాతి పళ్ళాలమీద."

"మీది  ఈవూరేనా?" అని కొత్త మిత్రురాలు అడిగింది రాజేశ్వరిని.

చప్పున నేను కొంటిగా,

"ఆమెకి యింగ్లీషురాదు" అని కొండపైకి చూశాను భయంతో.

రాజేశ్వరి నవ్వింది.

పద్మనాభమే అక్కడ వుంటేనా నా గొంతు నులిమివుండే వాడు? భార్యకి యింగ్లీషు రాదంటే భరించగలడా?

"మీది యీదేశం కాదా?" అంది తెల్లపిల్ల.

"తెలుగు."

"మేం చూసిన తెలుగువాళ్ళు యిట్లా లేరే!"

తెలుగువాళ్ళు రకరకాలుగా వుంటారు. అందులో మాది మరీ దూరపు రకం. మీరు?"

"మేము కూర్గు వాళ్ళం,"

"నా జాతకంలో, గడిచిన జన్మలో నేను కూర్గువాణ్ణని వుంది. నాలో ఏమన్నా యింకా మిగిలివచ్చిన కూర్గు చిహ్నాలు కనబడుతున్నాయా?"

"కూర్గు వాళ్ళంటే అట్లా వుండాలి" అని ఆ మొగవారి వంక చూపింది తెల్లపిల్ల.

"ఒంటి కన్ను అద్దం కూడానా?"

"తప్పక"

"మా అమ్మ నడగాలి ఆ అద్దం ఎక్కడ పోయిందో?"

దాంతో ముగ్గురూలేచి ఏదో అన్నారు నా పూర్వజన్మపు భాషలో.

"చాల్లే, పోదాం రా" అన్నట్టు అర్థమయింది నాకు.

రాలేనంటున్నట్టుంది నవ్వులపిల్ల. పూర్వజన్మజ్ఞానం యింకా వున్నట్టుంది నాకు. "ఇప్పుడు నువ్వు వెళ్ళావా, అయిదింటికే చీకటి పడుతుంది. ఈ కొండల్లో యింటికెట్లా వెళ్ళను?" అన్నాను, దిగాలుగా. ఒంటికన్ను కోపంగా చూసింది నావంక. ఆ భాషలో నోరు విదిలించింది. ఆమె "ససేమీరా కదలను, ఏమన్నా చేసుకో" అంటున్నట్టుంది. ఏమయేదో. మరి యింతలో అతని కడుపు చల్లగా, పద్దనాభమూ, పిల్లలూ వొచ్చారు. మేము తాము

లేని సమయంలో సంపాయించిన మనుషుల్నీ, వాళ్ళ సిల్కుచీరల్ని, సూట్లనీ, జుట్టు దువ్వెనల్నీ, టైలనీ చూసి అతని వొళ్ళు పరవశమయింది. కృష్ణదేవరాయల తలపాగా మరచి వాళ్ళ టోపీల్ని చూస్తున్నాడు.

మా పద్మనాభం కరెక్ట్ సూట్, హాట్ చూసి, తమ జాతి నాగరికమైన మృగాన్ని వాసన పట్టినట్లు వాళ్ళ ముఖాలు విప్పారాయి.

"అమ్మా! మళ్ళీ ప్రజల్లో పడ్డాం" అంటున్నట్టు కనపడ్డారు. కాని, ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. ఆమె బూడ్సుల్ని చూస్తున్నాడు, అతను. పాదాల్ని చూడకూడదా అనుకున్నాను నేను. పద్మనాభం కోపంగా "యింట్రడ్యూస్ చెయ్యేవేం? అడవి మనిషి" అన్నాడు.

"వీళ్ళా! వీళ్ళెవరంటే వీళ్ళు కూర్గుదేశస్తులు. ఆయన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్. ఆమె మన బుడ్డీలో నీళ్ళు తాగి నవ్వే వుద్యోగస్తురాలు. ఆయన్ని యీ హంపీ కొండలకి నల్ల పొగ రంగు వెయ్యమని "ఆర్కియాలోజికల్ డిపార్టుమెంటు"వారు పంపారట. ఆమె "లేడీ ఆఫ్ సైలెన్సెస్" ఈయన అండీ, మా పద్మనాభం, హంపీ స్పెషలిస్టు." అన్నాను గబగబ.

"ఆయన "డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్" కాదు. "అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ జైల్సు" అంది మా మిత్రురాలు.

"రెండూ వొకటే" అన్నాను నేను.

"డైరెక్టరని యెందుకన్నావు?" అన్నాడు చుట్టని బైటికి తీసి ఆ రెండో సూటాయన. అని చప్పున కాలాతీతమైనట్లు చుట్టని నోట్లో పెట్టేశాడు.

"నామీద అధికారం చేస్తూవుంటే, మా డైరెక్టరేమో అనుకున్నాను."

"మీరు ఇన్స్పెక్టరా?"

"మా యింట్లో......స్కూల్లో కుర్రాళ్ళు నామీద యిన్స్పెక్టర్లు-"

"ఏమండీ, యీయిన మీ మీద యిన్స్పెక్టరా?" అంది రాజేశ్వరితో, నవ్వుతో నవ్వులపిల్ల.

రాజేశ్వరి నా భార్య అనుకుందని పద్మనాభం గ్రహించి, ఆమె జోళ్ళులేని వాడి భార్య యెట్లా అవుతుంది అన్నట్లు చూసి, తొరగా 'ఆమె నా భార్య!" అని ఆమెను భుక్తపరుచుకొని రక్షించుకొన్నాడు.

"మీరు టీచరా!" అంది నవ్వులపిల్ల నన్ను.

"కాదు, ట్రెయినింగుస్కూలు టీచరు. క్షమించండి ఆ ద్రోహానికై" అని సిగ్గుతో తలవంచు కున్నాను.

ఇంక వూరుకోలేక పద్మనాభం మా పేర్లూ, వూళ్ళూ, వుద్యోగాలూ వాళ్ళకి తెలియచేశాడు. అతని మర్యాదవాక్యాలూ, నాగరికతా, ఇంగ్లీషు వుచ్చారణా, పొట్టిమీసమూ చూసి వాళ్ళు అతనితో చేతులు కలిపి వాళ్లెవరెవరో చెప్పుకున్నారు.

ఆ చుట్ట ఆయన ఇంగ్లండులో సగం చదివి యింటికి వొచ్చాడు.

కాలిఫోర్నియా బి.సి. నాగరికత అనే దానిని గూర్చి యింగ్లండులో "రిసర్చి" చేస్తున్నాడు. "గాలిక్ భాషలో అచ్చులు పదమూడా పదిహేనా?" అని చర్చించి ఏం.ఏ.డిగ్రీ పొందాడు. మళ్ళీ వెళ్ళి చదివి వొచ్చి యీ దేశంలో పోలీస్ డిపార్టుమెంటులో చేరాలని వుద్దేశ్యం. పద్మనాభం కూడా తానూ యింగ్లండుని బాగా యెరిగివున్నట్టుగానే మాట్లాడాడు. భార్యని ప్రశ్నించి, రెండు మూడు ఇంగ్లీషు మాటలు మాట్లాడించాడు. పిల్లలచేత మేరీ హేడ్ ఎవైట్ లాంబ్ (Mary had a white lamb)- ఇల్లాంటి పద్యాలు వప్ప చెప్పించాడు. హర్షించి అందరూ కరతాళధ్వనులు చేశారు.

"మా వుద్యోగాలు అడిగారు కారేం?" అంది నవ్వుల పిల్ల.

"క్షమించండి, ఇప్పుడు అడుగుతున్నాను" అన్నాను.

"ఈమెకి ఆయన బోడ్సులు రంగువేయడం, నాకు ఈయనలాగు చిరుగులు కుట్టడం పని," అంది.

వాళ్ళు నలుగురూ ఒకరి కొకరూ జ్ఞాతులట.

పద్మనాభం ఒకటే ప్రశ్నలు వాళ్ళని-"హంపీలో ఏం చూశారు. ఎక్కడ దిగారు?" అని వాళ్ళు కమలాపూరు బంగళాలో దిగారట. కృష్ణదేవరాయల పేరు వినలేదట. వినాయక విగ్రహం చెక్కిన వాడెవరో యెరగరుట. వాళ్ళ జ్ఞానరాహిత్యాన్ని తెలుసుకొని దిగులు పడేటట్లు చేశాడు వాళ్ళని. హంపీని, హంపీ దృశ్యాలనూ, రామరాజును. రైల్లో సాయేబుమందుల్ని అమ్మినట్లు అడ్వర్టైజ్ చేశాడు వాళ్ళకి.

"మూట విప్పాడు" అన్నాను రాజేశ్వరితో.

"పాపం! కొట్టుకుపోతున్నారు ప్రవాహంలో" అంది.

అతన్ని చూస్తే వేళాకోళం రాజేశ్వరికి.

ఆ వేళాకోళం ఆమె ప్రేమకి అడ్డంరాదు.

"ఇంకా యూనివర్శిటీ సంగతి రాలేదు."

"యూనివర్సిటీ యేమిటి?" అంది ప్రవాహంలో మధ్య ఆగిన నవ్వులపిల్ల, తెలుగులో మధ్య ఆ యింగ్లీషు ముక్క విని.

చెపుతున్నాను నేను సంగతి సందర్భాలు.

పద్మనాభం నన్ను కోప్పడి, నోరుమూసి మాట్లాడుతున్నాడు.

సూర్యుడు సగం మాత్రమే కనపడుతున్నాడు. కొండ వెనుక కొండ రాళ్ళ నీడలు ఒకదాని మీదికి ఒకటి పాకుతున్నాయి, వాటి చేతుల్లాగు. నేను స్నానానికని లేచాను. పిల్లలూ గంతులు వేశారు. పద్మనాభం ప్రవాహం ఆగకతప్పింది కాదు. దాంట్లో యీది వాళ్ళ స్నానాలు పూర్తి అయినాయి-

"నది చూపుతాను రండి, కృష్ణదేవరాయలు, పెద్దన్న, రామరాజభూషణుడు స్నానాలు చేసిన నది" అంటో దారి తీశాడు. పక్క కొండమీద కూచున్నారు, వాళ్ళు. కోతుల్ని దూరంగా తరిమి నీటి మధ్యనున్న రాయి మీదికి వెడదామంటుంది నవ్వుల పిల్ల. "bathing costumes" (బేతింగ్ కాస్ట్యూమ్సు) లేవని పిల్లల్ని దిగనియ్యలేదు, పద్మనాభం.

నేను ఒక్కణ్ణే వున్నాను. నీటిమధ్య కొత్తగా నేర్చుకొన్న యీతని ఎగ్జిబిట్ చెయ్యాలని నాకోర్కె.

నీలంగా చల్లగావున్న నీళ్ళలో ఆడుకుంటున్న నన్ను యీర్ష్యతో చూస్తున్న నవ్వుల పిల్ల "తువ్వాలవుంటే నేనూ దిగుదును" అంది.

"ఏం కట్టుకుని?"

నవ్వినాక వినబడకండా ఏమిటో చెపుతోంది. నల్లని ఆమెతో.

నల్లని ఆమె సిగ్గుపడుతోంది.

"వీల్లేదు" అంది కంటి అద్దం.

"నువ్వామాట అన్నందుకన్నా దిగాలనివుంది" అంది నవ్వులపిల్ల.

"రండి, చాలా హాయిగా వుంది" అన్నాను. నేను.

"ప్రపంచం చెడ్డది" అంది ఆమె.

చీకటి పడుతోంది. గోపురంమీది పడే కడపటి కాంతికూడా ఆకాశం మీదికి వెళ్ళిపోయింది. నేను కదలలేదు. వాళ్ళు వెళ్ళాలని లేచి ఒక్కమాట లేకుండ వీపులు తిప్పారు. ఒక్క నవ్వులపిల్ల మాత్రం "గుడ్‌బై" అన్నది కళ్ళలోనుంచి.

"చెయ్యి ముందుకు చాచాను. నవ్వుతో అక్కడే రాయిమీద నుంచునే నా చేతిని పట్టుకున్నట్టే నటిస్తో తన వుత్తచేతిని వూపింది." నా అరచేతిని చూసుకున్నాను.

"ఏమిటి?" అంది.

"తెల్లగా అయిందేమోనని."

"నవ్వింది. ఆమె వెళ్ళడం దిగులేస్తోంది నాకు.

"మళ్ళీ ఎప్పుడు దర్శనం?"

"పరలోకంలో."

"మళ్ళీ రారా?"

"రేపు పదింటికే బంగళానించి అటే ప్రయాణం."

"పద్మనాభం, మరి ఏమేమో చూపుతానంటున్నాడు!"

"వ్యవధి లేదు."

"ఉత్తరం రాస్తారా?" అన్నాను వెర్రి ఆశతో.

"ముందు మీరు రాయండి."

"చిరునామా?"

"కేరాఫ్ యమధర్మరాజు."

"పేరూ?"

"హంపీ కన్య."

"అని పేరుపెట్టి కథ రాయనా?"

"కథలు రాస్తారా?"

"అవును"

"నేనూ రాస్తాను"

"ఏ పత్రికలో?"

"ఆకాశంమీదా. మీరూ?"

"నీటిమీద."

వాళ్లు రమ్మని కేకలు వేస్తున్నారు. తిరిగింది.

"హంపీ కన్యా!" నీళ్ళలో మునిగాను.

మెల్లిగా లేచి చూశాను.

"భయమేసింది" అంది, ఆగి.

"నువ్వు వెడితే, మునిగిపోతాను."

"రాజేశ్వరితో చెపుతాను"

"మంచిపని జరిగింది అంటుంది."

"అబద్ధం"

"చుట్ట అబ్బాయి వొస్తున్నాడు, దూకు. దూకు. నీళ్ళలో దాక్కో"

"నేను వెళ్ళాలి, మరి మునగవద్దు"

రాయికింద నక్కింది. నేను అవతల ఒడ్డున కూచున్న నీలం పిట్ట వంక చూస్తున్నాను.

"ఏదీ....ఏమండీ....అమ్మాయి యేదీ...?"

"ఎవరునువ్వు?" అన్నాను తిరిగి.

తెల్లబోయి చూశాడు.

"మా అమ్మాయి యేదీ?"

"నువ్వెవరు. మీ అమ్మాయి యెవరు?"

"చెప్పండి దయచేసి"

"నీళ్ళలో పడ్డది"

వెతుకుతున్నాడు. పిలిచాడు. వెతికి వెతికి వెడుతున్నాడు.

ఆమె మెల్లిగా రాతి వెకననించి సినిమాలో అహల్యవలె లేచింది.

"నేను వెళ్ళకపోతే కొంపలు మునుగుతాయి"

"వద్దు, నేను మునిగిపోతాను"

"మీరు పైకి రారాదూ?"

"నది నన్ను కావిలించుకుంది."

"నేను పిలిస్తే-"

"నవ్వే కన్యకన్న కావిలించుకునే కన్య నయం కాదా?"

కొంచెం కోపమొచ్చింది.

"చాలు"

వెడుతోంది.

"హంపీకన్యా!"

ఆగింది.

"కోపంతో వెళ్ళవద్దు. ఆఖరుచూపు నవ్వుతో కనపడు"

నవ్వుతో నుంచుంది.

"కదలకు, ఫోటో తీస్తున్నాను"

"దేంతో?"

"నా కళ్ళతో. నవ్వుతో నుంచో"

"నేను వెళ్ళాక ఏం చేస్తావు?"

"కలలు కంటాను"

"లాభంలేని కలలు కద!"

"అందువల్లనే నిరాశ వుండదు"

"ఫోటో తియ్యడం అయిందా!"

"స్టెడీ, ఒన్, టూ, త్రీ"

నీళ్ళలో. మునిగాను. లేచేటప్పటికి యెవరూ లేరు. కొండలూ, రాళ్ళూ నాలుగు నక్షత్రాలూ. పక్కున నవ్వాయి.

నది నీళ్ళు మాత్రం నా బుజాన్నీ, మెడనీ, తాకి వోదారుస్తున్నాయి. కళ్ళు ఫోటోని తలచుకొని బాధిస్తున్నాయి. నడిచి నున్నని రాయినోదాన్ని చేరుకొని దిగాలుగా పడుకుని ఆకాశంకేసి చూస్తున్నాను. పచ్చని మబ్బువూగుతోంది, నడినెత్తిన. పక్కన గుడినీ, ఎదుటనున్న గుట్టల్నీ చూస్తో కలలుకన్నాను. ఒకవేళ ఆమె వాళ్ళని అందుకోలేక, మిగిలిపోతే ఆలస్యంగా వచ్చినందుకు ఆమెని వాళ్ళు చీవాట్లుపెట్టి వెళ్ళకొడితే! ఆమెకి ఏమీ తోచక ఓరాత్రి లేచి వొచ్చేస్తే! ప్రయాణం ఆగి, పోనీ ఆఖరికి, రేపు మళ్ళీ వాళ్ళంతా వొస్తే?

మెళుకువతో నవ్వు కూడా వచ్చింది! ఇన్నేళ్లొచ్చినా, ఇన్ని నిరాశలూ కలిగినా, యిన్ని ఆశలు భగ్నమైనా, యింకా నాకీ నమ్మకమేమిటి అదృష్టం పట్ల! జీవితం వృథాగా గడవదనీ, హృదయాన్ని నేలరాయదనీ, దూరంనించి యేదో దివ్యరేఖ నాకై ప్రయాన మవుతోనే వున్నదనీ నాకేమిటీ. విశ్వాసం? కాని, కాని, ఎన్ని చిరునవ్వుల్ని ఈ కళ్ళు ఫోటోలుతీసి దాచుకున్నాయి! కొన్ని పటాలు కన్నీళ్ళలో కరిగిపోయినాయి. కొన్నిటిని కోపాలు కాల్చేశాయి. కొన్ని అంతులేకుండా కొత్త ఫోటోల వెనక అణగారి పోయినాయి. కొన్ని యెంత పిలిచి, పిలిచి విలపించినా, తిరిగి కళ్ళల్లోకి రాకుండా ఆకాశంలో యెగిరిపోయినాయి. భవిష్యత్తులో విశ్వాసమే. మబ్బులకి రంగులువేసే నా కలలే నాకు మిగిలాయి.

రాత్రికాగానే శిలలు తమ పూర్వ ఔన్నత్యాన్ని గూర్చి జ్ఞాపకాలు కక్కుతున్నాయి. నేను వెళ్లేటప్పటికి పద్మనాభమూ. విద్యార్థులూ గుడి డాబామీద చేరి కూచున్నారు. దక్షిణపు వేపున రెండు పొయ్యిలు పెట్టి వంటలవుతున్నాయి. పప్పు పులుసు వాసన వాతావరణానికి నోరూరుస్తోంది.

ఒక విద్యార్థి కొబ్బరిపచ్చడి దంచుతున్నాడు. పైన స్వచ్ఛమైన ఆకాశమూ, పడమట ఎర్రజీరా, చుట్టూ మసకలో ధీరంగా నుంచున్న కొండలూ, తూర్పున ఆకాశానికి చూచుకుంటున్న గాలిగోపురమూ, పాదాలక్రింద ఆలయమూ, అర్చనా, దీపాలూ. చాలా గంభీరంగా ప్రశాంతంగా వుంది దృశ్యం.

గుంపు దగ్గిరికి వెళ్ళాను. ఒకమూల యెర్రటి కాగడా కనబడ్డది. చల్లని సిగార్ పరిమళం ఘుప్పుమని మద్రాసు క్లబ్బుని జ్ఞాపకానికి తెచ్చింది.

చుట్టల దొర!

నా కళ్ళు ఆశతో, కలలు నిజమైనాయనే విజయానందంతో, దొరచుట్టు అల్లుకున్న సంజ మసకల్ని వెతికాయి. పట్టంచు, బూడ్సుకాలు, గార్డినియాసెంటు, జాకెట్‌గల బుజం అయితే? నా గుండె నీరసపడ్డది. ఆ పట్టంచు యెరుపుకాదు: పసుపు. ఆ బూడ్సు నలుపే కాని మేజోడు తెలుపు, ఆ జాకెట్ పచ్చపట్టుకాదు కొయ్యరంగు. గాలిని గంతులెత్తించే నవ్వులు కావు. "నా జోలికెవరు రాగల"రని చీకటినే చెదిరించే దిఖ్ఖార దృష్టులు!

నల్లపిల్ల.

ఇంకా చితకని విశ్వాసంతో వెతికాయి కళ్లు గుంపుని. లేదు. అట్లానే వెక్కిరిస్తుంది విధి, సగం ఆశలు రేపి.

"ఏరీ వాళ్ళు!" అంది కంఠం, అడుగంటక పెనుగులాడే ఆశలతో.

"వాళ్ళు వెళ్ళారు. వీళ్ళిద్దరూ ఉండిపోయినారు."

"వాళ్ళనికూడా వుంచలేక పోయినారా?" అని ఏడ్చింది హృదయం.

"వుండలేదు."

"వాళ్లిద్దరికీ వంటరిగా ఏం తోస్తుంది?" అన్నాను నిస్సహాయంగా.

"ఎప్పుడు ఇట్లా ఒంటరి సమయం దొరుకుతుందా అని మూడురోజుల్నుంచి తిప్పలు పడుతున్నారు" అన్నాడు చుట్టల్లోంచి. కాళ్ళూ చేతులూ చచ్చుపడి ఓ మూల ఒరిగాను. పొయ్యిలు మండుతున్నాయి.

నక్షత్రాలు మెరుస్తున్నాయి. పదార్థాలు వుడుకుతున్నాయి. గాలివీస్తోంది. కాని, నాకేం సంబంధం అదంతా!! ఆ పిల్ల నన్నెందుకు పలకరించాలి? నాతో ఎందుకు నవ్వాలి? నన్నెందుకు వదలాలి? ఆ బంగళాలో వాళ్ళిద్దర్నీ దొంగలు కొడితే బావుంటుంది! పాపం దయదలచి నాతో మాట్లాడినందుకేగా ఈ శాపనార్థాలు! మొగబుద్ధి!

రాజేశ్వరి వచ్చి నన్ను గుంపులోకి లాక్కుపోయింది.

"మా రాజేశ్వరి పాట విన్నారా? కాకినాడ కలెక్టర్ ఆనందరాజన్ ఆనందంలో మునిగిపోయినాడు. మమ్మల్ని ఎరగనప్పుడు. కారులో వచ్చి మా యింటిలో పక్కన గంటలకొలది పడివుండేవాడు ఈమె పాట కోసం. సరిగా ఒచ్చి స్నేహం చేసుకొని యాడవకూడదూ? మళ్ళీ ఐ.సి.యస్. బెట్టు. నా రాజేశ్వరిని కాస్తా కాజేస్తాడేమోనని భయమేసింది కూడాను నాకు" అన్నాడు పద్మనాభం.

"ఉండండి వూరికేను!"

"నా రాజేశ్వరి లేకపోతే నే నెట్లా బతకగలను?" అంటో మమ్మల్నందర్నీ మరచి ఆమెని కావలించుకున్నాడు, కన్నీళ్ళొపుకుంటో.

కొబ్బరి పచ్చడిలో తిరగమాత బహురమ్యమైన వాసన వేస్తోంది, మల్లెపూలకన్న, జవ్వాజికన్న ఆకర్షకంగా.

రాజేశ్వరి పాడడం ప్రారంభిస్తోందేమోనన్న భయంతో ఒణికి నా స్థలాన్నించి లేచి ఆ నల్లనిపిల్ల పక్కన చేరాను.

"అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ

తస్మాత్ కారుణ్యాభావేన, రక్ష రక్ష మహేశ్వరి."

అన్నాను. నవ్వులపిల్లే అయితేనా, ఆమె పాదపద్మాలమీద రాలి వుండనూ?

ఈమె నా వంక ఓ నిమిషం నల్లగా చూసి, 'ఏమిటి?' అంది ఇంగ్లీషులో.

"రాజేశ్వరి పాడబోతోంది. సమయం దొరికిందా, నలుగురు కూడినచోట అల్లా పాడించక మానడు ఆయన. నే నెరుగుదును. యీ నాటికీ అట్లానే పడివున్నాయి. ఆమె పాట విని, ఆకుల్ని దిగులుతో రాల్చి వేసుకున్న చెట్లూ, ఈకలు రాలుకున్న పిట్టలూ. రాళ్ళు సహితం దిగులుతో మూలుగుతాయి. భోజనం సమయందాకా, మీరు పాడితేనే గాని ఆ ముప్పు తప్పదు."

నా హాస్యపు కంఠాన్ని విని ఆమె "నేనేం వెర్రిపిల్లనుగాను. నేనెవరో చీకట్లో గుర్తించక పారబడుతున్నారు. నా దగ్గిర యీ చిలిపి వేషాలు కటిపెట్టు" అన్నట్టు ఒక తీక్షణమైన చూపుచూసి, బూడ్సుకాలితో గాజుల పురుగును తన్ని, నడిచిపొయ్యే సోల్జరువలె నా నించి ముఖంతిప్పుకుని కూచుంది. ఆడదాన్నించి తిరస్కారం భరించదు యీపాడుజన్మ.

"అనుగ్రహించరా?"

"నాతో మాట్లాడకు" అని బొద్దింకను దులిపినట్టు దులిపింది.

ఆ మాటతో ఆగ్రహం కలిగింది నాకు. 'ఎట్లా యీమెకి మళ్ళీ తృణీకారాన్ని వప్పచెప్పడం? నన్ను చూసింది మొదలు నన్నిట్లా గొంగళి పురుగుకింద, పరవాన్నంలో యీగ కింద లెక్కకట్టి ప్రవర్తిస్తోంది. ఏమి గర్వమిది? చీరలా, చదువా, అధికారమా?' అని ఆమెని పరీక్షించాను ఇదివరకు తోచలేదు గాని, ఆమె గర్వంగా పైకెత్తిన గడ్డం నించి నా చూపులు జారడం ప్రారంభించినాయి. ఇంత అహంభావము కరిగి వరద అయి ముంచిందా-వాడు, వాడెవడో ధన్యుడు. ఆ కంఠం కింది ఒక్కవొంపు చాలు, జన్మనంతా స్రవింప చెయ్యడానికి. ఈ స్త్రీల జోలి వొద్దని యెన్నిసార్లు నేను దూరంగాపోయినా, చివరికీ కొండల్లోనూ, అడవుల్లోనూ, వీళ్ళని కంటిముందు నిలిపి, వూరించి, తప్పించి, నన్ను బాధిస్తోంది విధి. నా తలయెత్తి, తలపుల్ని మళ్ళించుకునేటప్పటికి పద్మనాభం ఏదో మాట్లాడుతున్నాడు.

"ఇక్కడ గనక ఒక్క యూనివర్శిటీ పెట్టించారా, ఈ వాతావరణపు నిర్మలత్వమూ, యీ సృష్టి సౌందర్యమూ-"

"అన్నీ నశిస్తాయి" అన్నాడు చుట్టలదొర.

పద్మనాభం వెన్నులో పొడిచినట్లు తెల్లబోయినాడు.

"అవునులెండి, అవునులెండి, మనుష్యుడే అన్ని అందవికారాలాకూ, అసహ్యాలకూ కారణం. సృష్టి యెంతో సుందరమయింది. స్వచ్ఛమైనది.

"ఈశ్వరుడు కరుణతో ప్రసాదించిన ఈ అమూల్య వరాల్ని దుష్టంగా, నీచంగా, అపాయకరంగా మార్చుకున్నాడు మానవుడు.

"యీ తినడం, యీ కనడం ఎంత నీచమైన పనులు- ఆ అవయవాలన్నీ అంత మురికిగా వుండకండా చెయ్యలేడా? ఊరికే మనుష్యుల్ని వుద్ధరించేవాడని పొగడుతారు గాని, యెంతకీ దేవుడు మానవుల్ని నీచమార్గాల అణిచిపెట్టాలనే ప్రయత్నం. కాని, మానవుడే, పాపం, ఆ మురికిలోనే రుచుల్నీ, ప్రేమల్నీ, మోహాన్ని కల్పించుకొని తప్పించుకో చూస్తున్నాడు. ఏంచేస్తే యేం లాభం? భూతదయని గురించి మాట్లాడుతూనే వుంటాడు: గొడ్లను చంపి, చీల్చుకొని తినడం తప్పించుకోలేడు. గొప్ప గొప్ప కళలని గురించి వుపన్యాసమిచ్చే రసికుడు కుక్కలాగే ప్రవర్తిస్తాడు భార్యతో. దేశాలు పాలించే చక్రవర్తి, కంపు చెమటలు పోస్తాడు.

"ఈ లోకంలో మనుష్యుడి భావాలకీ, ఆదర్శాలకీ స్థలంలేదు. ఎక్కువ దయ గలిగినవాళ్ళూ, సత్యవంతులూ మాడి నశించిపోతారు. పెద్ద పులికి భూతదయ గలిగితే యామవుతుంది? ఒకర్ని వొకరు పీక్కు తినడానికి ఆలోచనా, అసహ్యమూ లేకుండా, మింగి, కని, బతకడానికి వుద్దేశించాడు. ఈ లోకాన్ని. ఎంత పశువైతే అంత నయం" అన్నాను.

"కాదు, సృష్టి క్రూరమయింది. ఈ లోకంలోని సౌందర్యాన్నీ, మాధుర్యాన్నీ, కల్పించింది మానవుడే. సృష్టికల్పించిన వరదల్నీ, అగ్నుల్నీ మనిషి, హద్దులోకి తెచ్చి వుపయోగిస్తున్నాడు. ఈ కొండల్ని విగ్రహాలుగా రంగుల్ని పటాలుగా, మట్టిని పింగాణీగా, పురుగుల్ని పట్టుబట్టలుగా, యెంత ఆకర్షణీయంగా చేశాడో చూడు."

"అడవిజాతి స్త్రీ చూడు, యెంత నాగరికమూ, లావణ్యమైన స్త్రీగా తయారైనదో!" అన్నాను నల్లపిల్లని సంతోషపెడదామని.

"నోరుముయ్యి నా సంగతి యెత్తకు"

ఆ సభలోంచి ఆకాశానికి యెగిరే విధం లేదా అనిపించింది నాకు.

"అంత అధమురాలవా?" అన్నాను మండిపోయి. సర్రున లేచింది. తారాజువ్వమల్లే.

"You scamp, you vagabond of a"

పెద్ద కేకతో చీకట్లో యిద్దరు ముగ్గురు కన్నడంలో ఏదో అరుస్తూ డాబా మీదికి పరిగెత్తుకు వొచ్చారు. మా స్టూడెంట్సు గిన్నెలు మూట కడుతున్నారు తొరతొరగా!

"దొంగలు సార్, దొంగలు వొచ్చారు, కిందికి రండి"

అర్థంగాక చూస్తున్నాము. దొంగలేమిటి? ఇంకా నక్షత్రాలన్నీ కనపడటంలేదు, సరిగా. హాస్యమనుకున్నాను. వాళ్ళు మాత్రం అరుస్తో మమ్మల్ని కిందికి తోస్తున్నారు.

"ఏమిటి? ఏమిటి?" అంటోంది నల్లపిల్ల.

"దొంగలు" అంటున్నాను, విరోధాలు ఏమైనాయోగాని, తరువాత యేం జరిగిందో మెట్లమీద చీకట్లో నా బుజాన్ని మెత్తని వేళ్ళు ఒణుకుతో పట్టుకున్నాయి. బుజం అనుకుంది ఆ గుంటల మెట్లుదిగుతో, నేనని తెలుసా? నేను పలక్కుండా ఆమె నడుంచుట్టూ చెయ్యేసి పడకండా ఆనించుకున్నాను ఆ నడుము వేళ్ళకింద పాకడంతో దొంగలూ, కోపాలూ, మెట్లూ అన్నీ మరచి, యింకా దగ్గిరిగా అదుముకున్నాను. కిందికివెళ్ళి తడుముకుంటో గర్భగుడి ప్రమిదల వెలుతురులోకి ప్రవేశించినప్పుడు తన మొహం యెత్తి నాకేసి చూసింది. కళ్ళు అమ్మవారి మెళ్ళో హారంమీది వజ్రాలవలె మెరిశాయి. ఒక్క వూపుతో నా చేతిని విసిరి గోడకేసి పారేసి, "ఇంత సిగ్గు లేని వాడా" అన్నట్టు చూసి, విసురుతో వెళ్ళిపోయింది ముందరికి. ముందు నన్ను పట్టుకున్నది తనూ !!

దొంగలవేపుకి దృష్టి మళ్ళించాను. దొంగలువస్తే మేము కిందికి దిగడమెందుకు? స్టూడెంట్సు వంటలు మోసుకొని వస్తున్నారు.

"ఆ పులుసు భద్రం" అంటో వెంట నడుస్తోంది రాజేశ్వరి.

"నాన్‌సెన్సు, దొంగలా, యెన్ని గుండెలు! నువ్వేం భయపడకు రాజేశ్వరీ" అంటున్నాడు పద్మనాభం. కాని, ఆమె ధ్యాస దొంగలకన్న పులుసుమీద లగ్నమైవుంది. గుడి ముందువున్న దుకాణం వాళ్ళందరూ పెట్టెలు మోసుకుని గుళ్ళో జొరబడుతున్నారు. దొంగలు నిజమే. పదిమంది పట్టి బరువైన సింహద్వారాన్ని మూస్తున్నారు. నాకు చూడ్డం సరదాగా వుంది. కాని, దొంగ లేరి ? మరి రారేం ? "వస్తున్నారు." అన్నారు యెవరో.

మా ముందు గొప్ప గాలిగోపురం, వెనుక యెత్తయిన గర్భగుడి, రెంటినీ కలుపుతో తాటెత్తు ప్రహరీ గోడ ! ఇంక దొంగలు రావడమేమిటి ?

"వచ్చి ?"

"ఈ గోడ దూకుతారు."

దొంగలకు అది నిత్యలీలలాగు మాటాడారు.

"ఎందుకు రావడం?"

"స్వామివారి వజ్రపు నగలున్నాయి. యాడాదికి రెండు మూడు సార్లిట్లా బందిపోటు కొడతారు వాటికోసం."

"ఇంకా నగలు అట్లానే వున్నాయే!"

"వాళ్ళ తరమా దోచుకోడం?"

"ఏం?"

"స్వామి మహత్యం."

వాళ్ళ విశ్వాసాన్ని చూసి యీర్ష్యపడ్డాను. సోమనాధ దేవాలయం దోపిడి సంగతి ఫస్టుఫారంలో చదివిననాడే పోయింది, స్వామివారి మహత్యంలో నమ్మకం నాకు.

నల్లపిల్ల యామయింది?

చుట్టూ ఏడుమైళ్ళ అడవి. బొబ్బిలివాళ్ళన్నా కబురు పంపగలిగారు గాని,

ఆమె యామైతేనేం? ఎక్కడవుంటే నాకెందుకు? తిన్న చీవాట్లు చాలవా? అవును. ఆమె సంగతే వద్దు నాకు. అయినా ఆమె నన్ను ఆనుకున్నప్పుడు మాత్రం మెడనుంచి కేశరంజని పరిమళం కొట్టింది. ఎదురుగా ఆనుకునివుంటే! వద్దు. ఆ ధ్యాస యెందు కిప్పుడూ?

యుద్ధ సన్నాహాలు జరుగుతున్నాయి. ఒక పాత తుపాకీ తీసుకొచ్చి తుప్పు దులుపుతున్నారు పూజార్లు.

గుడిమీదికి రాతిబండలు యెక్కిస్తున్నారు కొందరు. అరుపులు కోమట్లు మూల మూలల సెటిలవుతున్నారు.

ఆ నాలుగు నిమిషాలూ, ఆ చీకట్లో ఆమెని, సాహసించి.....

ఛీ, ఏమి టీ ఆలోచనలు! కొరగానివన్నీ!......కాని మళ్ళీ యీ జన్మకి అటువంటి....

సిగ్గులేదు.

ఇంకా రారేం దొంగలు ? ముందు నోటీసిచ్చి తయారుకమ్మని చెప్పి, రాజపుత్రులమల్లే ధర్మయుద్ధానికి వస్తున్నట్టున్నారే?

ఎక్కడన్నా చీకట్లో కూచుని వుందేమో! వెళ్ళి....ఆమె ఈసారి మొహంమీది వుమ్మేస్తే యామన్నా బుద్ధి వస్తుందేమో, యీ మనిషికి ! ఇంత లేకిదనుకోలేదు నా గుణం!

కొందరు బురుజు లెక్కుతున్నారు. ఆ సన్నాహాలు చూస్తే ఏనాటి పూర్వుల రక్తమో కొంచెంగా నీరసంగా గంతులు వేసింది. ఈ చదువుల, పరీక్షల, వుద్యోగాల అడుగునించి, యింకా చావక.

ఆ మూలనించి చుట్టలదొరా, నల్లపిల్లా వస్తున్నారు.

"ఒక్క రివాల్వర్ వుంటేనా?" అంటున్నాడు చుట్టలదొర.

"దొంగలు దూకితే!" అంది ఆమె.

"నేను లేనూ!" అన్నాను మూలనించి. తలెత్తి చూసి తప్పుకుంది. కళ్ళలోని తిరస్కారమూ అసహ్యమూ, చీకటి మింగేసింది, నా దగ్గిరదాకా రాకుండా. సిగ్గు విడిచినా కాముకుడికి అభ్యంతరాలూ, హద్దులూ ఉంటాయా? వాళ్ళ దగ్గిరిగా వెడుతున్నాను. "ఎవరన్నా బంగళాకి వెళ్ళి రివాల్వర్ తెచ్చి పెడితేనా?" అన్నాడు.

"ప్రస్తుతం మీ చుట్టలోనించి యేమీ పేలేవేలేవూ?" అన్నాను.

నవ్వాడు బిగ్గరగా, వెర్రిబాగులవాడు

"పోదాం రద్దూ" అంది అతనితో ఆమె, కుష్టురోగినించి తప్పుకున్నట్టు. అతను వినిపించుకోలేదు.

గర్భ గుళ్ళో ప్రమిదెల వెలుతురు మాదాకా రావటం లేదు. మనుషులు చీకట్లో భూతాల్లాగ తిరుగుతున్నారు-గోడలమీదా, గోపురాలమీదా.

"గోడలు ఇంకొంచెం యెత్తు కట్టుకుంటే నేం?" అంది.

"అసలు దొంగలు లేరు, అడావిడి" అన్నాడు నవ్వుతో.

రానీ, తెలుస్తుంది, నీ పనీ, లేని నీ రివాల్వరుపనీ, నీ చుట్టపనీ, నీ "కజిన్" పనీ అని కసిగా తిట్టుకున్నాను. ఈ డాబులు అప్పుడూ! అనుకుంటో వుండగానే ఆ పైనించి యెవరో....

"అరుగో దొంగలు" అన్నారు. కన్నడంలో. అరగంటనించి వింటోండడం చాత ఆ మాటలు నాకర్థమైనాయి.

"ఏమిటి" అన్నాడు దొర.

"దొంగలు కనపడుతున్నారట, పరుగెత్తు-చంపు - హత మార్చు" అన్నాను.

నిజంగానే పరుగెత్తాడు గోపురంవేపు. ఆ అడావిడినీ, నల్లని ఆకాశాన్నీ చూస్తున్నాడు. గోపురరం మీద బైటనించి కాగడాల వెలుతురు పడుతోంది. నిజంగా వచ్చారు. లోపలికి రావడం యెంతసేపు? పాపం యీ ఆడవాళ్ళూ పిల్లలూ-

డమడమా తుపాకులు మా చుట్టూ పేలాయి. నా గుండెలు భయంతో ఝుల్లు మన్నాయి. అంతా చీకటి-గాలి గోపురంమీద కాగడాల వెలుతురు. పైన నక్షత్రాలూ. కింద తుపాకులు-చుట్టూ అడివి-మధ్య గుడి.

ఎవరు నన్ను పట్టుకున్నది? నా మెడని కావలించుకొని వణుకుతున్నది.

"భయంలేదు, భయంలే"దని "ఆటోమాటిక్"గా అంటో, చీకట్లో వెతికాను.

నల్లపిల్ల !

"దొంగలంటే నాకు భయం," అని పళ్ళసందులోంచి అని వణుకుతోంది.

ఆమెని దగ్గిరిగా పట్టుకుని, "భయంలేదు, వాళ్ళేం చేస్తారు ?" అన్నాను.

"కోస్తారు, చంపుతారు."

"నేను లేనూ?"

ఆమె వేళ్ళలోంచి సక్రమించే విద్యుల్లతలు నా భయాల్ని దిక్కులకి చెదర కొట్టాయి.

"నేను లేనా? నీ కోసం, యీ చిన్ని పిల్లలకోసం, యీ గడ్డంకోసం నా ప్రాణాన్ని అర్పించనా?" అన్నాను. అంతా మరిచిపోయాము. ఆమె ద్వేషం. నా రోషం, అంతా సమానాపాయంలో ఏకమైనాము. యుగయుగాలు తన దీనాలాపాలతో, శరణార్తితో, పురుషుణ్ణి బంధించుకున్న అబలత్వం ఆమెని రక్షిస్తున్నాననే మోసానికి స్వతంత్రాన్ని బలిచ్చుకున్న ధీరత్వం మాలో ప్రజ్వలించి ఏకంచేశాయి మమ్మల్ని ఆ నిమిషాన.

ఆమె నడుంమీద చెయ్యేసి, దగ్గిర తీసుకుని, శత్రువుల్ని, ఫిరంగుల్ని, విధినే ధిక్కరించే రాజపుత్రయోధుడివలె నుంచున్నాను. ఆ నిమిషాన నా స్వార్థాన్నంతా మరిచాను. ఆమె రక్త తీవ్రత నా రక్తంలో కలిసి భగ్గుమనిపించింది. అనాదిగా స్త్రీ సంరక్షణకై ప్రాణాలర్పించిన వీరుల ఆత్మలు నా చుట్టూ తాండవ మాడాయి. నా వుద్యోగం, కుటుంబం, ఆస్తి పిరికితనం, అన్నీ మరిచాను. ఆ నిమిషాన పురుషుణ్ణి, ప్రపంచానికి అతీతుణ్ణి అయిన స్వేచ్ఛా మానవుణ్ణి నేను. వేటా, స్త్రీ తప్ప యింతరమైన బంధనాలు లేని అనాగరికభిల్లుణ్ణి, ఆ దొంగలేవస్తే, ఆ నిమిషాన, కొందరి ప్రాణాలు ఆహుతి అయి వుండును, నా తాత్కాలిక సాహసాగ్నికి.

మనసులో రక్షణ ధీరత్వభావం కలిగిన నిమిషాన, పురుషుడు స్త్రీ ప్రేమని అనుభవించ గలిగినట్టు ఇంకెప్పుడూ అనుభవించలేడు. సాంబ్రాణి అగ్నిమీద పడ్డట్టవుతుంది. అటువంటి నిమిషం-ఆమె నడుముని, తొడల్ని నా కెదురుగా అదుముకుని, ప్రపంచాన్ని నేను ధిక్కరించిన నిమిషం యెన్ని జన్మాలకి కలుగుతుందో మళ్ళీ. ఆ చుట్టూ చీకటి. కోట గోడపైన నిర్మలాకాశం, బురుజులమీది మనుష్యులు. కేకలు, బైట శత్రువులు, తుపాకులు, నేను, నన్నానుకుని చేతులు నా మెళ్ళో పెనవేసుకుని నుంచున్న యీ కన్య!

స్టూడెంట్లు వెడుతున్నారు అట్లా. ఇట్లాంటి దృశ్యాలు నా విషయమై అలవాటే గనక వాళ్ళు ఆశ్చర్య మభినయించలేదు. నేను "ఏమిటా శబ్దాలు వాళ్ళకి అన్ని తుపాకు లెక్కడివి?" అని అడిగాను.

'తుపాకులు కావు, అవి బందూకులు"

"ఏం తెలివి! క్యాట్ కాదు, పిల్లి అన్నట్లుంది.

"నీ మొహం, భేదమేమిటి"

"నాటు తుపాకులు"

"అంటే పూజారి దగ్గిరివుండే, అట్లాంటివా?"

"అది తుపాకి కాదు?"

"ఇవి కావు"

వాటి స్వరూపాన్ని వర్ణించారు. అర్థమయింది. పెద్ద రోలూ రోకలి టపాకాయలు నవ్వు పట్టలేకపోయినాను.

"అవి యెవరినీ హాని చెయ్యవే!"

"అవును."

"మరి భయమేముంది?"

"భయమేమీ లేదు."

"వాళ్ళెందుకు కాలుస్తారు?"

"భయ పెట్టేందుకు."

"భయపడరుగా."

"భయపడతా మనుకుంటారు."

యాలిస్ ఇన్ ది వండర్ లాండ్ (Alice in the Wonder land) లో సీనుమల్లే వుంది. ఇదంతా, అంతా కల. కారికేచర్ కాని, నా చేతుల్లోని నున్నవి నడుం, జాజి పూల వాసనవేసే మెడ, నా కెదురుగా కొట్టుకునే హృదయం, ఇవి వాస్తవం. వాళ్ళ భాష ఆమె కర్థంకాదు. అయితే అంత భయపడం మానేసేదే!

ఇంకా టమటమలు. వాళ్ళేదో బందూకుల డాన్స్ చేస్తున్నట్లుంది. వెళ్ళాలనిపించింది చూడ్డానికి. కాని, ఈ మంత్రం పట్టు విడిపోతే! కాని, మళ్ళీ జన్మలో ఆ డాన్స్ చూడగలనా? కాని మళ్ళీ జన్మలో యీ అమృతాన్ని పొందగలనా? జన్మమంతా, స్త్రీ కోసం ధనాన్నీ, ఆరోగ్యాన్నీ, పలుకుబడినీ, పురోభివృద్ధినీ, సౌఖ్యాన్నీ త్యజించాను. అది హాబిట్ అయిపోయింది.

నా ఆలోచనల్ని గ్రహించిందేమో "నన్నొదిలి వెళ్ళవద్దు" అంది దీనంగా.

"మృత్యువులోనైనా సరే."

అని యింకా దగ్గిరిగా కావిలించుకున్నాను. కొంచెం భయపడ్డట్టుంది. ఇంక జన్మకి వదలడా యేమి అన్నట్లు, కొంచెం వొదిలింది నన్ను. కాని, నేను వదలగలనా?

గోడలమీదికి యెగబాకుతున్నట్టున్నారు దొంగలు. పై జనమంతా వీరాలాపాలు. లోపలి జనమంతా దీనాలాపాలు. స్త్రీలు యాడవడం, బిడ్డల్ని కావిలించుకోడం. పరుగులు, రొద. నే నేమీ ధైర్యశాలిని కాదు. కాని, యీశ్వర ధ్యానామృతంలో నిమగ్నుడైన యోగికి యిహలోక బాధలూ, భయాలూ యెట్లా అంటవో, అట్లానే ఆ కలవర మేమాత్రమూ నా హృదయాన్ని సమీపించలేదు. సినీమా చూస్తో ఆకర్షకమైన నూతన వనితపక్కనకూచున్నాడు.

చీకట్లో పొరపాటున పక్కకుర్చీమీద చెయ్యివేశాడు. సినీమా బొమ్మలోని నటి చేతికన్న మృదువైన చెయ్యి తన చేతిమీద పడ్డది. సినీమాలోని భీకర సంగ్రామంవల్ల అతని కెంత కలవరం కలుగుతుంది. అట్లా వుంది నా చుట్టూ రణ దృశ్యం నాకు.

ఈ కన్య నా బుజం మీద చెయ్యేసి, శరణమని అడిగితేనే, నా కింక ధైర్యం కలిగిందే, నిజంగానే, పూర్వపు కోటల్లో సైన్యాలు ముట్టడిస్తే, పైనించి తమ వంకచూసే మృదునేత్ర దృష్టులవల్ల ఆ యోధులెంత వుధ్రుతమైన వుత్తేజాన్ని పొందేవారో! ఆ స్త్రీలు భయకంపిత నేత్రాలు చూస్తే, కంఠాలు వింటే, మహమ్మదీయులు విజయనగరాన్ని కొల్లగొట్టిన దినాలు, ఆ అంతఃపురాంగనలు తల్లడిల్లిన విధం స్ఫురణకి వొచ్చింది. వాళ్ళ ఆత్మలింకా ఆ వాతావరణంలోనే నివసించి, వీళ్ళతో కలిసి అల్లల్లాడుతున్నాయా అనుకున్నాను. ఆనాడు హింసపడి, యింకా కర్మ మిగిలి, తిరిగి అనుభవించడానికి జన్మయెత్తిన రాచకన్య కాదుకద ఈమె! లేకపోతే, సుఖంగా ఆ ట్రావెలర్సు బంగళాలో నిద్రపోవలసిన పిల్ల ఏ గీతవల్ల, యే విధి శాసనం కింద వెనుక దిగబడి, నా చేతుల్లోకి వురికినట్లు?

పద్మనాభం వొచ్చాడు. నల్లపిల్ల నా పక్కనే అంటక నుంచుని వుంది.

"మరి నువ్వు యూనివర్శిటీ పెడితే - మధ్య ఈ దొంగలుపడితే" అన్నాను.

"వీళ్ళందర్నీ ముందు హతమార్చనూ?"

"అవునులే, విద్యార్థులకి వేరే సైనిక శిక్షణ అక్కర్లేదు."

"ముందు ప్రస్తుతం నీ స్టూడెంట్సుకి వడ్డన శిక్షణ వుచితం. రా,రా" అంటో ముందు వెళ్ళాడు.

"రా, నేను భోజనం చెయ్యకపోతే, విద్యార్థులు చెయ్యరు."

"నన్ను విడిచి పోవద్దు"

"నువ్వు రా, భోజనం చెయ్యవూ?"

"నాకు సయించదు"

"పోనీ, నా దగ్గిర కూచో."

వెళ్ళాం.

"చుట్టలదొర యేడీ?"

"రారుట. అక్కడికే తెమ్మన్నారు."

"బలే, ఏమీ?"

"అదంతా చూస్తున్నారు."

ఇది ఆమె పూర్వజన్మ దోషమా, నా పూర్వజన్మ పుణ్యమా, రెంటి ఐక్యమా? నిజమేమో ఈ అదృష్ట మనేదీ, ఈ కర్మ సిద్ధాంతమూ! కోరనిదే, ప్రయత్నించనిదే, గుమ్మంలోకి వొచ్చి ప్రేమభిక్షం యాచిస్తారు కన్యలు! ప్రయత్నించి, సంపాయించిన ప్రియురాళ్ళని విషపునవ్వులతో యే బొండుప్లీడరో తన్నుకుపోతాడు!

భోజనానికి రమ్మని స్టూడెంట్సు పిలిచారు.

అప్పుడు జ్ఞాపకం వొచ్చారు, ఆకలి, పద్మనాభమూ, సంసారమూ, పైకి వెళ్ళిన చుట్టలదొరా. ఏమైనారో! సినిమా అదృష్టవంతుడు, తోడు వొచ్చి, బెంచీ క్లాసులో సంసారంతో కలిసి కూచున్న మిత్రుడి సంగతి యెంతమాత్రం జ్ఞాపకం తెచ్చుకుంటాడు? సినీమాపాక అంటుకోనీగాక?

"రండి, సార్"

"ఈ అడావిడిలో భోజనాలేమిటి?"

ఏ ఆడావిడికి? బైటనా, నా హృదయంలోనా?

"సార్, ఆ దొంగలు లోపలికివస్తే అన్నమంతా తినేస్తారు. మనకి మిగలదు" వీళ్ళకి చదువుచెప్పి ఏం ప్రయోజనం! హ్యూమర్ (humour) నీ రొమాన్స్ (romance) నీ చంపే ఆ చదువు! నా ప్రపంచం నాదీ, వాళ్ళ ప్రపంచం వాళ్ళదీ! రెండూ యే మూలా అంటవు, క్లాస్ రూమ్‌లో తప్ప!

భోజనానికి వెళ్ళక తప్పదు.

అసలు పనికివచ్చే విషయాలమీద దృష్టిలేదు నాకు.

జీవితమే అంత. పనికిరానివి లేవనే దిగులుతో గడుస్తుంది.

"ఇదే ఆఖరు భోజనమేమో మనకీ, రాజేశ్వరీ" అన్నాడు పద్మనాభం.

"అబ్బాయ్, ఏదీ ఆ పప్పుపులుసు" అంటోంది రాజేశ్వరి.

నల్లపిల్ల తొడ అంటేటంత దగ్గరిగా కూచుని, నా విస్తరివంక నా వేళ్ళవంకా చూస్తోంది.

"కొంచెం" అని నేను కలుపుకున్నది ఆమెకి యివ్వబోయినాను.

మా యిద్దరి ఆకస్మిక స్నేహాన్ని చూసి ఆశ్చర్యపడుతున్నారు మనుషులు. ఆమె మొహంవంక చూసే ధైర్యం లేదు నాకు. భయం. నిలవదు. భయం చెదరగానే నన్ను ద్వేషిస్తుంది. నా రత్నాల కల అంతం.

"తెలివి రానీయకే కల కరిగిపోతాది."

అన్న మహాకవి హృదయవేదన బోధపడ్డది, ఏమైతేనేం?

ఈ లోపల ఆ రెండు హాస్యపదాలన్నా పలికి కొంచెం పాత కసితీర్చుకోవచ్చు. "వెయ్యండోయ్, ఇంకొంచెం ఆ అరటికాయ కూర" అని కంఠం తగ్గించి ఆమెతో-

"నువ్వు మూర్ఛపోతే నిన్ను యెత్తుకుని బంగళాదాకా మోసేందుకు నాకు శక్తి వుండనొద్దూ! ఇవన్నీ తింటేగదా ఈ దొంగల్ని ఎదుర్కోడం, నీకు నా వీర్యశక్తి చూపడమూను?"

నా మాటలు యింకో విధంగా అర్థమౌతాయని నాకేం తెలుస్తుంది? ఆ గర్భగుళ్ళో అమ్మవారు యేమి ఆలోచిస్తున్నారో!

నా మాటలు విని నల్లపిల్ల చివాలున లేచి వెళ్ళిపోయింది. కల కళ్ళముందే కరిగిపోయింది. దిగాలుగా తల యెత్తాను. నిజస్థితికి.

నా అదృష్టాన్ని నా విట్‌కి బలి యిచ్చుకున్నాను. పానుగంటి వారి వ్రాతలలోవలె. కుర్రాడు సరిగా భోజనం చేస్తున్నాడో లేదో శ్రద్ధగా చూస్తోంది రాజేశ్వరి. పద్మనాభం టై సద్దుకుంటున్నాడు.

భోజనం వదిలేసి, స్టూడెంట్సు చూడకుండా చెయ్యి కడుక్కుని చీకట్లోకి వెళ్ళాను. చీకటి కన్యను వెతుకుతో. ఆశలేదు. మళ్లీ ఆమెనించి తృణీకారం రాసివుంది నా మొహాన. ఆమె శరీర స్పర్శ జ్ఞాపకం వొస్తుంది నా బుజంమీద ఆమె తలని ఆనించడం, నామీద ఆధారపడి నా కళ్ళలోకి చూడడం, వేళ్ళతో నా మెడని మెల్లిగా తాకడం.

పోనీలే-తిట్టనీ-అభిమానం మోహజీవనానికి శృంఖలం, చుట్టూ ప్రాకారాల్లో, స్తంభాల వెనక, గర్భగుడి చుట్టూ వెతికాను. అమ్మవారిని అడిగాను. లంకలో సీతని వెతికే హనుమంతుడి గతివలె వుంది. హృదయంలోని మొహాన్ని మినహాయిస్తే!

ఎక్కడ వెతికినా కనబడదు. గోపురంమీద చుట్టలదొర కాళ్ళు వేళ్ళాడేసుకొని కులాసాగా చుట్ట కాలుస్తున్నాడు. కింద కాగడాల జనం. నల్లని ఆకారాలు. కాగడాలు చాలావరకు ఆరిపోయి యెర్రనిప్పులుగా రగులుతూ పెద్ద సిగార్లవలె, ఇంజను ముందు దీపాలవలె భయపెడుతున్నాయి. ఆ నల్లని ఆకారాల చేతుల్లో. ఎడతెగని చీకటి, కేకలు, పూజార్లు తుపాకి గంటకోసారి పేలుస్తారు కింద నుంచున్నవాళ్ళు నవ్వుతున్నారు.

"ఇల్లాంటి ఘోరయుద్ధం జన్మానికొక్కసారి కన్న యెక్కువ చూడము. తీగలేని తంతియిచ్చి కమాండర్ హేగ్‌ని పిలిపించాలి. బలే" అని నవ్వాడు చుట్టలదొర.

"నీ రివాల్వరే వుంటే-"

మర్డర్ కింద చార్జ్ చేసి తీరుతారు నన్ను. రివాల్వరా? వీళ్ళకి? ఈ పిల్లల ఆటకి? బెత్తాలతో తన్నాలి. ఇది మీ డిపార్టుమెంటు" అన్నాడు.

లేదు ఆమె అక్కడ.

కిందికి ఒచ్చాను. గోపురంకింద వడిగా నన్ను కలుసుకుంది.

"ఏమైనావు? నీకోసం అంతా వెతికాను" అంది.

నా మొహంవంక జాలిగా చూచింది.

కల పోలేదు. కాని, ఏమిటి యీ అనురాగం నామీద? ఈ అవసరానికి అర్థమేమిటి? ఎవరు చెప్పగలరు? ఏ సైకాలజీ తర్కించగలదు? ఏ ఊర్ధ్వలోకంలోనో ఆమె జన్మనక్షత్రమూ, నా నక్షత్రమూ ఆ రాత్రి ఆ ముహూర్తాన దగ్గిరికి జరిగాయి గావును.

ఆమె వంక తిరిగాను. ఇంకా కల విషయం భయంగానే వుంది. దేవతలు కొద్దికాలంవున్న నాపైని అనుగ్రహించడం మామూలుకాదు. అమూల్యమైన నిమిషాలు వ్యర్థం చేస్తున్నాను. ఆమె విద్యావంతురాలు ఆమె రక్తంలోని ఆకర్షణ కళ్ళలో అనేక కళలలో ప్రకాశిస్తోంది. ఆ జాలి, ఆ కోపం, ఆ అనుకంప, భయం, ప్రేమ ఎన్ని చంపలనించో తళతళమంటున్నాయి. ఆమె హృదయ మాణిక్యకాంతులు.

"ఇట్లా రా."

దూరంగా వెళ్ళాము, అందరి కళ్ళముందునుంచీ నడిచి, రాత్రి మించిపోతోంది. ఇంక నిద్ర ఆమెను క్లెయిమ్ చేసి తీసికెడుతుంది నానించి. కాని, యీ రాత్రి నిద్రా!

ఆమె గడ్డంమీద మూడువేళ్ళు వేసి "భోజనం చెయ్యవూ? నా కోసం."

రాత్రి గడియలు నన్ను పురికొల్పుతున్నాయి.

"నాకోసం."

ఆమె భోజనం చెయ్యడంలో నాకేమాత్రమూ ఇంట్రెస్టు లేదు. ఎవరినీ బతిమాలను నేను. ఆమెని బతిమాలే నేను, ఆమెని బతిమాలే ఆనందమే, బతిమాలడంలోని రసికత్వమే, సత్యభామని వృధామిషమీద బతిమాలే రసికావతంసుడి ఆనందమే నాది. పలచని, అనాఘ్రాతమైన ఆ రొమ్ము దగ్గిరగా వేళ్ళేసి ఆమె కళ్ళలోకి చూసి, ముఖాన్ని దగ్గిరగా తీసుకునే మాధుర్యం కోసమే మూగాను ఆమెచుట్టూ.

"నేను తినలేను" అంది నా బుజానికి ముఖాన్ని రాస్తో గోముగా. ప్రేమతో నిండిన స్త్రీ కంఠంకన్న గాంధర్వలోకంలోనైనా శ్రావ్యసంగీతం వినపడుతుందా?

"ఎందుకు తినలేవోయీ!"

అల్లాంటి నిమిషాలు నా కంఠంలో ఎన్నడూ వినని మాధుర్యం వినపడుతుంది నాకే. అల్లాంటి అనుభవాలవల్ల నాకు సందేహం కలుగుతుంది. మనస్సుకన్న ఉన్నతమయింది. ఆత్మ అనేది వుందేమోనని. అట్లాంటి అసాధారణ ముహూర్తాల నా ఆత్మ గూఢసింహాసనాన్ని దిగి కనికరించి నా సహాయార్థం వేంచేస్తుదిదేమోనని అనుకుంటాను.

"భయం."

ఆ భయమనే మాట బీజాక్షర మయింది ఆ రాత్రి నాకు.

"భయమనకు. నేను చచ్చిపోయిన తరువాత అను ఆ మాట."

"ఊఁ" అంది. కులకూజితమూ మొదలైన ఉపమానాలుపయోగించారు కావ్యకారులు. వాటిమీద అభిమాన మెక్కువైనా, ఆ శబ్దానికి ఉపమానాలుపయోగించడం అవివేకమనుకున్నాను.

అమ్మవారు ఆశ్చర్యపడి చెవియొగ్గి వింది.

చల్లగా నామీదికి వొంగి, ఆమె నున్నని వేళ్ళకొనలతో నా మెడతాకుతో నుంచుంది. ఇంక నా (ప్రూడెన్స్) స్వాధీనం తప్పుతోంది.

"వెడదాం రా."

మెల్లిగా అడుగుల్లో అడుగులు అడ్డాలుపడుతో నడుస్తోవుంటే నా కాశ్చర్యం వేసింది. నే నెవరు! ఈమె యెవరు?

నీళ్ళు తీసుకురమ్మన్నాను. స్టూడెంటును. చేతిని అతి జాగ్రత్తగా మృదువుగా మధురంగా కడిగాను.

కూచున్నాము. కలుపుకుంది. తినదు. దిక్కులు చూస్తుంది. బెదురుతుంది. నిట్టూర్పులు విడుస్తుంది.

"తినకపోతే, నేను పెడతాను."

నవ్వింది, మళ్ళీ గోడలకేసి చూస్తోంది.

నేను అన్నం తీసుకుని-'నా ముద్ద' అన్నాను.

పకాపకా నవ్వాము. నవ్వే ఆమె నోట్లో అన్నం పెట్టేశాను. ఇంగువతో, కందిపప్పు వాసనతో సువాసనగల సాంబారు ముద్దని.

నా బుజం ఆమె బుజాన్ని తాకుతోంది. నావేళ్ళు ఆమె వేళ్ళని విస్తట్లో కలుసుకున్నాయి.

ఆమె బ్లౌజులోంచి నార్సినస్ పరిమళం నా తలకి మత్తెక్కిస్తోంది. ఆమె పెదవుల్ని నావేళ్ళు తాకినప్పుడల్లా ముద్దులవలె నరాలు కంపించాయి.

ఎవరు కన్నారో, నాకోసం ఈమెను? ఈ అందాన్ని, ఆ బుజం కింది చేతి మెరుపును, నవ్వే ఆ పళ్ళ శృంగారాన్ని, నావేపు ఒంగినప్పటి వొయ్యారాన్ని, ఎంతమంది పరితపించి, తపించి, గాఢాలింగనాల్లో వేదనలు పడి, కన్నారో! ఎంత ముద్దుగా పెంచారో, ఆ జుట్టుని మెత్తగా! కళ్ళ చూపుల్ని జార్చే ఆ శుభ్రాన్ని ఎంతకష్టపడి పోషించారో నాకోసం!- ఆ రాత్రికి!

నా బంధువులే, చిన్నపిల్లలైనాసరే, భోజనానికి అట్లా మంకుతనం పడితే,

అసహ్యించుకుని వుందును. కాని, యే బంగళాల్లో, యే పాన్పులో, యే దాదులదగ్గిర గారాబంగా పెరిగిన ముద్దరాలో పాపం!

నిజంగా ఆ దొంగలే. ఆ ఘాతకులే లోపలికివచ్చి మమ్మల్ని అరణ్యాలలోకి లాక్కెడితే!-నా కళ్ళముందే యీమెని, ఆ సుకుమారిని వాళ్ళు బాధిస్తోవుంటే, ఆ కళ్ళతో జాలిగా ఆమె నావంక చూస్తే......నేను కల్పించుకున్న భయంకరదృశ్యంతో నాకు దుఃఖమొచ్చింది.

కాని, అట్లాంటిది జరుగుతుందా? సాధ్యమా! ఈమెని-యింత-

కాని, ఎన్నిసార్లు యీ లోకంలో జరగలేదు? ప్రియులముందే ప్రియురాళ్ళని, తండ్రుల ముందు కూతుళ్ళని, ఏ ఈశ్వరుడడ్డపడ్డాడు? ఈనాడెవరు కాపాడుతారు? ఆ దీన స్త్రీల రోదనం, వేదనా నా చెవుల్లో గింగురుమన్నాయి. మృతులైన అబలల దీనత్వరూపాల్ని ధరించి తోచింది ఆ కన్య నాకు. ఎన్నడో పోయిన కృతజ్ఞతాభావం పొడసూపింది, బంది పోట్లని అరికట్టిన యీ ప్రభుత్వంమీద, నాహృదయంలో. కాని, ఈనాడు కూడా, హొస్‌పేటకి యేడుమైళ్ళ దూరంలో ఈ ఘోరమేమిటి, మరి ఈ దొంగలేమిటి?

ఆమె చెయ్యి కదుక్కుంది. చీకట్లో నా వుత్తరీయంతో చేతులూ, మూతి తుడిచాను. ఇద్దరమూ నడుస్తో యుద్ధభూమి సామీప్యానికి వెళ్ళాము అంతఃపురంలో దాక్కునే వుత్తరుడివలె ఫీలయినాను నేను.

"పైకి వెళ్ళి చూద్దాము."

"అమ్మో!"

"ఇదిగో, నన్ను నమ్ము. నేనుండగా భయమేమిటి?"

రాణాప్రతాప్ కూడా అట్లా మాట్లాడలేదు.

మెట్లమీద చీకట్లో ఆగాము. నా భుజంమీద వేళ్ళాడి కూలవేసింది.

"కొంచెంసేపు కూచోండి."

బుద్ధిలేనివాళ్ళు, ఎక్కుతో దిగుతో వుంటారనే చీదరకాని, నాకు అంతకన్న ఏం కావాలి? నా మెడచుట్టూ చేతులువేసి, తలని నా బుజంమీద పెట్టుకుని కూచుంది.

మళ్ళీ చీకట్లో జ్ఞాపకం వొచ్చింది. ఈమె యెవరు? నే నెవరు? ఇట్లాంటి నిమిషాల్లో 'స్కెలిటన్' వలె తలెత్తి నేనెంత ద్వేషిస్తేనో కాని విడవదు. అంత గట్టిగా కావలించుకుంటుంది యీ వేదాంతం.

ఈమె యెవరు? నేనెవరు? ఈ రాత్రి దొంగలమూలన యిట్లా చేరాము. నదిలో కొట్టుకుపోయే కాష్టాలలాగు. నేను రాజకుమారుడు: ఈమె కష్టాలలో వున్న రాజపుత్రి. అంతా నాటకం. ఆ రాత్రికా వేషాలు వేసుకున్నాం. తూర్పున ఒక్క రవ్వ వెలుతురు

సోకిందా, ఈ దొంగలు వెనక్కి పలాయనమైనారా, కోడికూతకు హామ్లెట్ ఘోస్టు వలె అంతా, యీ నాటకమంతా పటాపంచలవుతుంది. రంగు కడిగేస్తాము.

నేను స్కూలుమాష్టరూ, ఆమె జడ్జీ కూతురూ. ఆ రాత్రికి నాతో వేషం ధరించింది, కరుణించి, ఈలోకం, యీజన్మ, యీ మాయా ఇంతే. ఇంతే, ఇంతే.

కాని, నాకూ వేదాంతులకీ ఒక్క భేదముంది. మా ఆలోచనలు ఐడెంటికల్. కాని పర్యవసానం వేరు. క్షణభంగురమేనని వాళ్ళు ఒదులుకుంటారు. క్షణభంగురమే అనే దిగులుతో నేను కానలించుకుంటాను.

మళ్ళీ యీ రాత్రి ఒస్తుందా? యీ నాటకము ఆడగలమా? మళ్ళీ ఈ వేషాలు వేస్తామా? ఈ లావణ్యం, ఈ మనోహరత్వం నా చేతికి అందుతుందా? మేఘరథాల్లో విహరించే గంధర్వకన్య ఏ ప్రమాదంవల్లనో ఏ శాపం చేతనో ఓ నిమిషం నా వొళ్ళోవాలింది. ఆ నిమిషం ఆమె నా వొళ్లో తలవాల్చి పడుకోనే, రేపా? రేపు పొద్దున్నే విరహాగ్నిలో, ఈ అనుభవ జ్యోతిలో మాడి భగ్గుమని మండిపోనీ ఈ జీవితాన్ని? ఎవరికి కావాలి! నన్ను చేసినవాడొకడుంటే, వాడు పడతాడు ముందు జాగ్రత్త! లేదా, పడడా-ప్రమాద మేమిటి? ఆమె చేతులు మెల్లిగా, జాగ్రత్తగా ఆమె ప్రాణమే వేళ్ళకొనల్లో నిలిచినట్టు నా బుజాల్ని, రొమ్ముల్ని, చంపల్ని తాకుతున్నాయి. వాటి సందేశం నాకు స్పష్టంగా తెలుస్తోంది. కాని, పాపం ఆమెకి తెలీదు. అర్థంగాక మాటలు పలికే చిన్నపిల్లవలె. శక్తి తెలీక జపించే మంత్రసాధకుడివలె, నిప్పుతో ఆటలాడింది ఆ అంధకారపు బాలిక.

ఎవరో వొస్తున్న అడుగుల చప్పుడు విని లేచి పైకి వెళ్ళాము. నా వెనకనే, భుజంమీద చెయ్యేసి వొచ్చి నుంచుంది. దొర పెద్దచుట్ట వెలిగించింది. బుస్సీమల్లే యుద్ధసన్నాహాల్ని పరికిస్తున్నాడు. ఆమె నన్నానుకొని నుంచోడం చూసివుంటాడుగాని, ఏమీ అనలేదు. ఒకింత అక్కడక్కడ కాగడాలు వెలిగించి చల్లగా కదులుతున్నారు దొంగలు. కాగడాల వెలుతురులో యెండిన పొడుగాటిగడ్డి, పొదలూ, బండలూ వింతగా నీడలలో వూగుతున్నాయి. నా భయం పూర్తిగా పోయింది. ఏ ఎమోషన్ కాని పట్టుమని హృదయాన్ని చాలాకాలం వేధించదు. నూతనత్వాన్ని వెతుకుతుంది ఎప్పుడూ. అందువల్లనే గావును, యెప్పుడూ ఏమోషనల్‌గా మారగలిగిన స్త్రీలలో అంత గొప్ప ఆకర్షణ!

ఆ యుద్ధమంతా రాత్రి భాగోతంలో ఒక రంగులాగు కనిపించింది. ఆ దొంగలు గోడను యెట్లానూ దాటలేరు. ఈ బ్రాహ్మలు యెట్లానూ వాళ్ళని పారతోలలేరు. ఎందుకీ అడావిడి? పడుకోరాదూ పోయి! ఏడాదీ ఆ అడవిలో ఒంటరిగావుండే ఆ పూజార్లకి ఈ యుద్ధం ఎమోషనల్ అవుట్ లెట్ కావును.

తటాలున దొర కోపంగా మాట్లాడుతున్నాడు, చుట్టలోనించి, నా మీద ననుకుని హడలి పోయినాను.

"స్వరాజ్యంట! ఈనాడింకా యీ దొంగలూ, దోపిళ్ళూ యిట్లా సాగుతున్నాయీ! యీ బండదేశానికి స్వరాజ్యంట! ఇట్లాంటి అనాగరికం యే దేశంలోనన్నా వుందా?"

ఆర్గ్యూ చెయ్యబోతున్నాను నేను అతనితో, ప్రభుత్వ తాబేదారునని మరచి. ఆమె నా వేళ్ళని మెల్లిగా పట్టుకుని వూయించింది.

"నిద్ర వస్తోంది" అంది.

"అప్పుడే!"

అయిపోయిందా? ఈ రాత్రికి ఇంక నిద్రేనా? తెల్లవారితే యీ భయమూ ఉండదు, పిల్లా వుండదు.

చుట్టలదొరతో చెప్పాను ఆమెకి నిద్ర ఒస్తోందని! అతను వినిపించుకోక చీకట్లో యుద్ధం చూసి నవ్వుతున్నాడు. నా కెట్లానో, అతనికీ అట్లానే జన్మానికల్లా ఒక్కసారే కలిగే అనుభవం లాగుంది ఆ రాత్రి.

మళ్ళీ చెప్పాను, బుజంమీద చెయ్యేసి, అతని దృష్టిని మరల్చి.

"పడుకో వెళ్ళి" అన్నాడు పరధ్యానంగా ఆమెతో.

"నువ్వు రా" అంది గావును వాళ్ళ భాషలో.

"నేనా! అప్పుడే! వస్తాలే, వెళ్ళి పడుకో." అన్నంతవరకు నాకు అర్థమయింది. తక్కింది తెలీలేదు.

నా వంక చూసింది. కిందికి తీసుకు వెళ్ళాను.

"ఎక్కడ పడుకుంటావు? నా పక్క తీసుకో."

"మీకు?"

"నేను చూసుకుంటాను కాదూ?"

నేలమీద నై తేనేం, ఆమె పాదాలవద్ద.

"ఈ శబ్దం వినపడనిచోట వేయించండి."

స్టూడెంటుని పిలిచి, మూలగా దూరంగా ఎవరూ తిరగనిదీ, శబ్దం దూరనిదీ స్థలం చూచి పక్క వెయ్యమన్నాను. గర్భగుడి వెనకాల, ఒక చిన్నదేవతకి కట్టిన గూట్లో పక్కపరిచి, తెచ్చిన దీపంతో సహా వెళ్ళాడు. దీపం ఉంచమంటే, "గుడివాళ్ళది, యిచ్చివెయ్యా"లన్నాడు. మేము తెచ్చిన లాంతరు రాజేశ్వరి కుటుంబానికి సంక్రమించింది.

చీకటి మా మధ్య. ఆమె మాట్లాడటంలేదు. ఏదో చేస్తోంది. ఏమిటబ్బా! దృష్టితో చీకటిని చీల్చి చూశాను. ఆమె తెల్లని చీరె నేలమీద పడుతున్నట్టుంది. ఇదేమిటి. చీరె విప్పేస్తోంది. నా ఆశ్చర్యం తక్కిన ఏమోషన్స్‌ని మింగేసింది. ఏం చెయ్యబోతోంది? ఇందాకటి

భయమంతా నటనా! అంత నీచురాలా? గొప్పవంశాల్లోకూడా యిల్లాంటి అధమ స్వభావాలుంటాయా?

మాట్లాడుతోంది, పనిచేస్తో. "మా అమ్మమాత్రం చీకట్లో పడుకోలేదు, మా నాన్న యెప్పుడూ వెక్కిరిస్తారు. నాన్న శిక్షించిన దొంగలు కసిపట్టి వొస్తారని అమ్మ భయం...."

ఇట్లా వాగుతోంది చిన్నపిల్లవలె, చీర మడత పెడతో. నేను మాటలు వినటంలేదు. పడుకుంటోంది. కాని, వొంటిన బట్టలు వున్నాయే! నవ్వు ఒచ్చింది. పాపం పిచ్చిపిల్ల! ఇంటిదగ్గరకు మల్లేనే పై చీర తీసి నైట్‌డ్రెస్(night dress) తో పడుకుంటోంది గావును. అలవాటు!

ఆమె అట్లా పడుకోడం నాకు కష్టమనిపించింది, ఎవరన్నా దీపాలు పట్టుకుని అటు తిరిగితే?

"చీర కట్టుకునే పడుకోరాదూ?"

"ఏమి?"

"ఇక్కడ వాళ్ళకి వికృతంగా కనపడుతుంది."

ఆలోచించింది.

"నిజం చెప్పండి. మీరేమనుకుంటున్నారు?"

"నిజమే - ఇంకేంలేదు."

"కాదు, వాళ్ళు - ఆ దొంగలు వొస్తారని. మీరు వాళ్ళు వొస్తారనే అనుకుంటున్నారు. అవునా?"

"కాదు"

"అబద్ధం, అబద్ధం."

నన్ను బుజాలు పట్టుకుని గట్టిగా వూయించింది. ఆమె జుట్టు నా మొహంనిండా పడి పరిమళాలతో నన్ను చుట్టేసింది.

"పడుకో, నీకేమీ భయంలేదు."

"నిజమేనా! మరి మీరు యిక్కడే వుంటారు కదా ! మేలుకునే కూచోవాలి."

"సరే"

ఐదు నిమిషాలు మాటల్లేవు. నిద్రపోతోందనుకున్నాను. ఎట్లా కూచోడం ఆ చీకట్లో ? ఆమెకి నిద్రపట్టనీ, వెళ్ళిపోవచ్చును - అనుకున్నాను.

ఉలికిపడి లేచింది.

"ఏమండీ?"

"ఏమి?"

"వెళ్ళిపోదాం. ఇక్కడ వొద్దు వెళ్ళిపోదాం. నాకు భయమేస్తోంది. నన్ను తీసుకుపోండి."

మారాం పట్టింది. నాకు చాలా దిగులేసింది. ఎన్నడూ కష్టమన్నా, భయమన్నా ఎరక్క పెరిగింది గావును!

లేచింది. నన్ను వెతుక్కుంటోంది. ఎట్లా యీ పిల్లతో! రొమ్ము చుట్టూ చెయ్యివేసి, దగ్గిరికి లాక్కుని ఒళ్లో పడుకో పెట్టుకున్నాను. నా తొడమీద మొహం పెట్టుకుని గారాబం చేస్తోంది. నాకు సిగ్గుగా, ఇబ్బందిగా వుంది.

"ఎందుకు భయం?"

"వెళ్ళిపోదాం, బంగళాకి వెళ్ళిపోదాం."

"ఎట్లా?"

"గోడదూకి పారిపోదాం."

"ఏమీ భయంలేదు. పడుకో." కొంచెం కోప్పడ్డాను.

పక్కమీద పడుకోపెట్టి, దగ్గిరిగా కూచుని చంపల్ని తాకుతో, బుజం తట్టుతో సమదాయించాను.

ఈమే, యీ నున్నని గుండ్రని బుజాలూ, యీమె నాకు, నాదిగా, జీవితంలో దొరికితే.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అనే మాట నాలుగుసార్లు నా నోటి దగ్గిరికి వచ్చింది. నా వెర్రికి నాకే ఆశ్చర్యమేసింది. సంసారానికి చెప్పక ఈమెతో యే దేశమన్నా పారిపోతే!

"నిర్భాగ్యుడా! నీ అదృష్టమంతా యీ నాలుగు గడియాలే. తెల్లారితే మళ్ళీ నీ స్కూలూ, వాసనకొట్టే పుస్తకాలూ, హెడ్మాష్టరు మొహం, సిరామరకల బల్లా సిద్ధం. నువ్వేమీ కావు. యోధుడివీ కావు, రసికుడివీ కావు, స్కూలు మాష్టరువి." అంటోంది నావివేకం.

కాని, ఆ రాత్రికి మాత్రం నిశ్చయంగా నేను తెనుగు నవలలోని రసపుత్ర వీరుణ్ణి, అజేయుణ్ణి, శివుడి దగ్గిరనించి వరంపొంది వచ్చిన సైంధవుణ్ణి.

పదేళ్ళనించి గుళ్ళనీ, గుడి దేవుళ్ళనీ తిట్టిన దేవవిరోధిని నేను. మొదటిసారి ఆనాడు గుళ్లో కాలు పెట్టాను. దేవతలు నా వ్రతభంగంపట్ల ప్రసన్నురాలైనారు. నా జీవితాదర్శం, నా స్వప్న ఆశయం తెలుసుకుని నాకీ కన్యను ప్రసాదించారు. నేనారాత్రికి పరపురుషుణ్ణి, అద్వితీయుణ్ణి. "దుర్మార్గమైన పనిచేసేవాడైనా, దైవంలో విశ్వాసం విడనాడకూడదు." అని శాసించాడు నాకన్న రసికాగ్రేసరుడు. అదృష్ట జాతకుడు కాసనోవా.

ఈ ముగ్ధని, ఈ అమాయకురాల్ని, అస్పృశ్యను, ఎవరి భార్య కాబోతోందా! ఏ కలెక్టర్ని, లేక కోటీశ్వరుణ్ణి వివాహమాడబోతోందో. ఎవర్ని తన హృదయమంతటితోనూ

ప్రేమించబోతోందో. నేను ఈమె భయస్థితిని పురస్కరిచుకుని, ఆక్రాంతం చెయ్యడం అన్యాయం! నాడు తన భర్తతో మొదటిరాత్రి, ఈ రాత్రిని తలుచుకుని ఎంత సిగ్గుపడుతోందో నన్నెంత శపిస్తుందో, అతనితో చెబుతుందా, దాస్తుందా! జీవితమంతా నా పేరుని తలుచుకుని భయపడదా, ద్వేషించదా ? నన్ను సంహరించదా ? ఏమైతేనేం? ఈ పని అధర్మం.

ఇక్కడవుంటే నిశ్చయం! పశువునై, నాజూకైన ఈ పుష్పాన్ని వదిగి నమ్మి నిద్రపోతున్న ఈ చిన్న పుష్పాన్ని, నలగతొక్కిపోతాను.

ఎట్లా పోను? నా చేతిని తన వేళ్ళసందున పట్టుకుని పడుకుంది. నిద్రపోతున్నట్టే వుంది, ఎట్లా పోను?

అంతా చీకటి. నిశ్శబ్దం. అప్పుడప్పుడు కొంచెంగా రొద వినపడుతోంది. గబ్బిలాల వాసన కింత రాళ్ళు వొత్తుకుంటున్నాయి. నన్నిట్లా మేలుకుని కూచోమనడంలోని క్రూరత్వాన్ని, స్వార్థాన్నన్నా గమనించనంతటి పసిపిల్ల వంటి మనసు. హాయిగా వెర్రి కళ్ళు మూసింది. ఆమె చిన్ని నోరునీ, పెదవుల్నీ, చూడడానికి వెలుతురుంటే బావుండుననిపించింది.

ఆమె చేతుల్లోంచి విద్యుచ్ఛక్తి నన్ను దగ్గిరికి లాగుతోంది. అసలే నేను మోహకాంతిలో ఏ చిన్ని కిరణానికైనా సరే తత్తరిల్లు తానే! ఇంత సహనమే నాకు విచిత్రంగా వుంది, నన్ను చూస్తే నాకే! పాపం. ఆమెకి తెలీదు, ఎంత విపత్తు పంచన పడుకొని నిర్భయంగా నిద్రపోతోందో. ఎంత అగ్నితో శిశువువలె ఆడుకుంటోందా! చెప్పితే? చెప్పినా తెలీదు! ఎట్లా చెప్పను! ఏం చెయ్యనూ! నాదీ దేహమే! అందులో నరాలపుట్ట సాధారణ స్త్రీనించి కూడా ఒక్క మంచిమాట, ఒక్క చిరునవ్వు నన్ను కంపించేస్తాయి. చిన్న గాలి తెమ్మెర, నీటి అల ఉద్రేకింపచేస్తాయి. ఇక్కడ-ఏం చెప్పను నా అవస్థ ఆమెతో? నా ఆత్మలో ఎంత సానుభూతి వుంటేనేం? నా హృదయంతో ఎంత జాలిపడితేనేం? నాదీ దేహం.

మెల్లిగాచెయ్యి ఒదిలించుకొని లేవబోయినాను. దూరంగా జరిగాను.

'ఊ, ఊ' అని నన్ను దగ్గిరికి లాగింది. నేను వెనక్కి ఒరిగాను ఆమె తోపువల్ల. నా నడుం మీదనుంచి చెయ్యిపోనిచ్చి. నా పొట్టమీద తల పెట్టుకుని గట్టిగా భయంతో ఒత్తుకుని పడుకుంది. ఆమె రొమ్ము నా తొడలకు తగలడంతో, ఆ చీకటి గుడి అంతా భగ్గుమని వెయ్యిదీపాలతో వెలిగినట్టయింది. ఆమె పైకి ఒంగి ఆమె పెదిమల్ని పక్కగా నా పెదవులతో తడిపాను.

ఆమె పితృదేవతలు, పతివ్రత లెవరైనా ఆ రాత్రి ఆమె సహాయానికై ప్రయత్నిస్తున్నారో యేమో! ఆమె నా తలని తోసేసి తల తిప్పుకుంది.

ఆమె అంగీకరించివుంటే అంతటితో ఆగేవాణ్ణేమోకాని, ఆమె నిరాకరణం నన్ను దుర్మార్గుణ్ణి చేసింది, ఇంకా ఎక్కువ ప్రయత్నించాను. ఆమె నన్ను తోసేసి తిరిగి పడుకుంది, కోపమొచ్చింది, లేచి వెళ్ళిపోదామా అనుకున్నాను, ఇదా నా సహాయము? ఆమె నా అక్రమానికి లోబడితే మిత్రుణ్ణి: శీలవతియై నిరాకరిస్తే శత్రుణ్ణి. సిగ్గేసింది. పురుషులందరూ ఇంతేకదా! వూరికే నీతులు మాట్లాడమంటే, మాట్లాడ మనకండానే మాట్లాడతారు. అవినీతి కథలు హెచ్చిపోతున్నాయని వ్యాసాలు రాస్తారు తమ మనసుల్లో పెరిగే కుళ్ళు సహజమై పోతుంది ఈ నీతిపరులకి.

కూచున్నాను అట్లానే. కునికిపాట్లు పడుతున్నాను. ఆమె కలవరిస్తోంది.

"ఏమండీ"

మట్లాడలేదు నేను.

బిగ్గిరగా "యామండీ"

"వూ"

చేతులు జాచింది నావేపు. దగ్గిరికి లాక్కుంది. నేను కదలక తలని మాత్రం ఒంచాను. ఇంకా విధితో పోట్లాడతూనే వున్నాను. నా తలని గట్టిగా కావిలించుకుని పడుకుంది. ఏం చెప్పను? అది స్వర్గమా? నారెండు చంపలకి ఆమె లేతవక్షం రెండువేపులా తగులుతోంది. నా నుదుటిమీద ఆమె చల్లని వూపిరి తగులుతోంది. ఆగూడు శచిదేవికి కట్టింది కాదుకద!

నాకు పిచ్చెత్తింది. నా రక్తం నా నాళాలలో అణగలేక, నిండుగోదావరి కాలవలవలె గట్లనూ తూముల్నీ చీల్చుకుని పరిగెత్తుతోంది వెల్లువలై, ప్రళయ వాయువువలె మోహాశక్తి యీ వైపునుంచి ఆ చివరకు చీల్చేటట్లు విజృంభించింది.

శీతలరక్తపు మనుషులు, మర్యాదలో చచ్చిన ఆత్మలు కలవాళ్ళు, నీతి అనే మాయ పెనుభూతంతో ఒణికే భీరులు, జీవించే శవాలు, సులభంగా నీతిపరులై, భక్తులై, అభినవ ప్రవరాఖ్యులై, బైటపడ గలిగివుందురేమో! నాకు చాతకాలేదు. యముడే వుండి, నా పాపానికై నన్ను ప్రశ్నిస్తే-

"నేను చేసిన పాపాన్ని మాత్రమే చూశావా, లేక నేను పడ్డవేదన, నన్ను లోబరచుకున్న నా రక్త తీవ్రతనికూడా గమనించావా ?" అని అడుగుతాను.

ఆమె వేళ్ళు నా మెడవెనుక జుట్టుకీ షర్టుకీ మధ్య బిగించి పట్టుకుంది. ఆమెని ముద్దు పెట్టుకున్నాను, ఆమె కింది పెదిమని. మెల్లిగా ముఖం తప్పించుకుంది. కళ్ళు నులుము కుంటున్నట్టుంది. ఎవరినో పిలుస్తుంది. చిన్నపిల్ల. చిన్నపిల్ల ఏ తల్లినో పిలుస్తోంది. నేనుగాక దిక్కెవరు? నన్ను నమ్మి నా చేతులో వాలిన ఈ గోరింకని చీల్చుకుని తిననా ? కాట్‌వలె, కుక్కవలె అనిపించింది, నా ప్రాణం.

ఆమెని భద్రంగా పడుకోబెట్టి కూచున్నాను. నా తొడని ఆనుకుని మీద చెయ్యివేసి పడుకుంది. దొంగల సంగతి మరిచిపోయింది గాని, ఆపద అనే భయం ఆమె మనసులో వుండనే వుంది.

తెలవారదా ? ఇంక ఈ రాత్రికీ, నా బాధకీ, నా టేంప్టేషన్‌కీ అంతంలేదా. ఈ జాలి ఎందుకు? ఈ సంకోచమే లేకపోతే, ఎప్పుడో తీరిపోను ఈ సమస్య! ఆమె కౌగిలిలో హాయిగా నిద్రపోతో వుందును.

ఇప్పుడైనా నిద్రపోతే? కాని, నా నరాలు యిట్లా తంతులవలె కంపిస్తున్నాయే! నా చేతులు, పెదవులు తిరగబడి, ముందుకి లాగుతున్నాయి. నిగ్రహం, నిగ్రహం అని అరుస్తారు పెద్దలు - పిన్నలుకూడా. శిలలు, నీతివిగ్రహాలు, కుర్చీల్లో కూచుని ఖండించే దేశపూజితులు, ముసలిపత్రికాధిపతులు, నపుంసక విమర్శకులు, వీళ్ళకేం తెలుసు ఆ నరకం? ఆ స్వర్గద్వారం దగ్గిర సంకోచిస్తూ నిలబడే ఆ నరకం ?

లేవాలంటే నా కాళ్ళు తిరగబడ్డాయి. అమానుష ప్రయత్నంచేసి బైటికి వెళ్ళిపోయినాను.

నేను ఎన్ని ఘోరపాపాలు చేసినా, ఆ రాత్రి, ఆ పుణ్యదేవతా సమక్షంలో, నేను ఆ కన్యని ఆ సమయాన నా అరిచేతిలోని కన్యని, పాపమని తలిచి ఒదిలి వచ్చినందుకై ఈశ్వరుడే వుంటే, నన్ను ఆశీర్వదించకపోతే, అతడు ఈశ్వరుడుకాడు. బండ, రాక్షసి, కాలేజి ప్రిన్సిపాల్ కన్న అధముడు. అతనికి కన్యల నిర్మలత్వం మీద ఏమీ అభిమానములేని పిశాచి.

నాతో ట్రిప్ వచ్చిన వాళ్ళంతా నిద్దర్లుపోతున్నారు. యుద్ధం సాగుతోనే వుంది. నక్షత్రాలు రెండు గజాలు పైకి జరిగాయి. అంగారకుడు నెత్తి వెనక వెలుగుతున్నాడు, బొబ్బిలినాటకం చూస్తో నిద్రపోయి లేచి, ఇంకా వెంగళరాయుడి వీరాలాపాలు చూస్తున్నట్టుగా వుంది. చల్లనిగాలి వీచింది. గాలితోకూడా వెనకగా నల్లపిల్ల వచ్చి రెండు చేతులతో బుజం మీద వేళ్ళాడింది. భయంతో రోషంతో.

"ఇదేనా వాగ్దత్తం?"

నాకు చమటలు పోశాయి.

ఈ నైట్‌మేర్ (nightmare) నించి విముక్తిలేదా? కాని, విముక్తి కావాలని నాకు నిజంగా వుందా? చిత్రగుప్తుడే నిర్ణయించాలి. కాని, ఆ చిత్రగుప్తుడుకి పనులతోనేగాని వుద్దేశ్యాలతో పనిలేనట్టుంది. ఉద్దేశ్యాలు తెలుసుకునేవాడే ఐతే, చొంగలు కారుస్తో నీతులు చెప్పే నవయువకులకీ, భార్యల్నే ఇతర స్త్రీలనుగా భావించుకుని కక్కుర్తి తీర్చుకునే కవులకీ, తమ స్వంత వ్యభిచారం దాచుకునేందుకు నీతి లెక్చర్లిచ్చే పత్రికాధిపతులకీ. స్కాండల్స్ (scancals) మాట్లాడి నోటిదురద తీర్చుకోడంతో తక్కిన అవయవాలను తృప్తిపరచే

భీరాగ్రేసరులకీ స్వర్గం రాస్తాడా? హరిశ్చంద్రుడికీ, అనసూయకీ స్వర్గమిస్తాడా? దమయంతిని పతివ్రత కింద లెఖ్ఖ పెడతాడా!

"వుక్కపోసి వచ్చాను" అన్నా.

"వుక్కకోసం నన్ను వదిలారా?" అని నా కళ్ళలోకి చూసింది. ఏదో నాకు బాధ్యత వున్నట్లు.

"రాబోతున్నాను. ఇంతలో నువ్వూ వచ్చేశావును.

"రండి."

"చూడు, యిక్కడ యెంత బావుందో?" అని ఇంకా పెనుగులాడాను.

నిజంగా బావుంది ఆ పురాతనపు రాతిగోడలమీద ఆ కాగడాల కాంతి. వందలకొలది ఏళ్ళనుంచి వానలో నున్ననైన బండలమీద ఆ నక్షత్రాల కాంతి, ఆ బురుజులు, గోపురం, గంభీరంగా, ప్రశాంతంగా వుంది. బ్రహ్మసమాజము వారైనా ఆ ఆలయ సౌందర్యానికి అంధులు కాగలరనుకోను. మహమ్మదీయులైనా సరే!

"ఇక్కడే కూచుందాం" అన్నాను.

క్రిష్టియనులైనా, బ్రహ్మసమాజపు నీతిపరులైనా, ఆ మాటలలోని సౌందర్యానికి, శ్రావ్యానికి, నైతికి శక్తికీ బధిరులు కాగలరనుకోవచ్చు. సందేహిస్తో కూచుంది. అందరూ నిద్రపోతున్నారు. మేలుకున్నవారు పైన వున్నారు. ఆ పెద్ద అవరణలో మేమిద్దరమే. నక్షత్రాలు, గాలి, కొంచెం చక్కని చలి. మేమిద్దరం - మళ్ళీ యెప్పుడు ? ఏ జన్మలో ? అనేక అందాలు చూశాను. గదుల్లోని ఏకాంతాన్నీ, భయాన్నీ, సిగ్గునీ, ఆవేశాన్నీ, పెంకితనాన్నీ చూశాను. కాని, సృష్టి వళ్ళో, నక్షత్రాలకింద, హృదయం ప్రేమతోనిండి కళ్ళనికూడా ఆజ్ఞాపించి, దాచి, ప్రియురాలితో కూచున్న సమయాలలో వంటి ఆనందం అసమానమైనది.

"వాళ్ళు దూకుతున్నారేమో చూడండి."

"ఇందాకణ్ణించి దూకారా ఇప్పుడు దూకడానికి ? అసలు వెళ్ళిపోయినారేమో!"

కూచున్నాము. ఆ కాంతిలో నాకు దొరికిన పెన్నిధానాన్ని చూసుకున్నాను. నైట్‌డ్రెస్‌లో ఆమె నడుమూ, తొడలూ, చేతులపై చివరలూ చూసి కళ్ళువాల్చి, పళ్ళు బిగపట్టాను.

నా కంతకన్న ఏమీ కోర్కెలేదు అప్పుడు. అట్లానే ఆమె తలను నా బుజాన్ని ఆనుకుని, సగం రొమ్ము పక్కగా నా నెత్తికి తగులుతో ఆమె అప్పుడప్పుడు కంటికొలికిలోంచి దీనంగా ప్రేమగా నా వంక చూస్తో, ఇంకేమీ వాంఛించలేదు. జీవితాన్ని పాలించే ఆఫీసుకూడా మన కోర్కెల్నీ? ఇష్టాల్నీ గమనిస్తుందా? ఇంకో విధంగా శాసించారు లోకాధిపతులు.

మళ్ళా దొంగల అరుపులు, తుపాకుల చప్పుళ్ళు.

చప్పున లేచింది ఆమె - నా చేతిని పట్టుకులాగుతూ.

"రా, రా."

తెలుసు నాకు, నైతిక శక్తికి మృత్యువాసన్నమయిందని-కాని కడపటి పెనుగులాట పెనిగాను గట్టిగా.

"నేను రాను."

చప్పున యేడ్చింది.

ఆ కన్నీళ్ళు ఆమె చంపల మీదనుంచి శిలవేసుకున్న నా హృదయం మీదపడి మహర్షి మంత్రోదకాలవలె, రామపాదరజంవలె చిగిరిపంచేశాయి. ఆమెని కావిలించుకుని ఓదార్చాను.

"వస్తానుగా" అన్నానుగాని, ఆమె మనసుని డైవర్ట్ ఎట్లా చెయ్యాలనా అని చూస్తున్నాను.

"రారేం?"

"యుద్ధం సంగతి కనుక్కుని వెడదాము."

ఎవరో వస్తున్నారు, స్టూడెంటు.

"యుద్ధమెట్లా వుంది?"

అయిపోయిందని చెబుతాడని నా ఆశ.

"ఇందాక ఒకడు దూకాడు."

నా వేళ్ళలోని ఆమె వేళ్ళు వణికాయి.

"కాని, తన్ని కింద తోసేశారు కాదూ?"

"లేదు. మనవాళ్ళు భయపడి పరిగెత్తారు. వాడే యెందుకో మళ్ళీ కిందికి జారాడు. బలేయుద్ధం!"

"ఇంక భయంలేదుగా?"

"లేకేం? మళ్ళీ వస్తారు."

నా ప్రశ్నలు కాస్తా, మోడల్ లెసన్స్‌లోలాగు అద్భుతంగా ఫలించాయి.

"లోపలికి వస్తే యేంచేస్తారు వాళ్ళు?" అంది యింగ్లీషులో.

ఆ కుర్రాడికి కొంచెం యింగ్లీషు తెలుసు.

"ఏం చేస్తారు? చుట్టూ చూసిపోతారు" అన్నాను తేలికగా.

"డబ్బు ఇమ్మని అడుగుతారు" అన్నాడు.

"డబ్బులేదే?" అంది.

"నగలిమ్మంటారు!"

ఒంటిమీద చూసుకుంది.

"లేవే అట్టే!"

"లేకపోతే తెచ్చియిమ్మని కాగడాలు పెట్టి మొహాలు కాలుస్తారు!"

బలే శిష్యుడు నాకు!

"స్కూలుకి పద. నీ పని చెబుతా!" అనుకున్నాను లోపల.

కాని, అతను మాత్రం యేం చేస్తాడు? ఈ కాలచక్రంలో మర ? ఆరాత్రి అతని ధర్మం నెరవేర్చుకున్నాడు. వెళ్ళాడు. ఈనాడు అతనెవరో నే నెవరో! ఆ రాత్రికి నా పాలిటి యముడ్డై వచ్చాడు.

ఆమె చల్లగా నా బుజంమీద నీటి ముద్దయి పడిపోయింది. ఆమెని భద్రంగా చేతుల్లో యెత్తుకుని పక్క దగ్గిరికి తీసికెళ్ళి పడుకోపెట్టాను. ఏం చెయ్యాలో తెలీదు నాకు. మూర్ఛపోయిన ఆడవాళ్ళకి, డాక్టర్ని పిలవడం తప్ప. నీళ్ళు చల్లనా? నీళ్లెక్కడ? ఎవర్నీ లేపడం యిష్టంలేదు. ఈమె నాది. ఈ రాత్రికి నాది. రక్షించుకోడానికిగాని, భక్షించు కోడానికిగాని. మెల్లిగా మెడకింద గుండీ విప్పి గుండె రాయాలని యత్నించాను. నాచేతికి తగిలిన నున్నని, వెచ్చని, వెన్నవలె కరిగిపొయ్యే స్థలాన్ని కళ్ళారా చూసి ఆనందించే భాగ్యం లేకపోయింది గతజన్మంలో రతీదేవిని కళ్ళు మూసుకుని చేత్తో మాత్రమే పూజించాను గావును. మెల్లిగా చేతులు నా మెడమీదికి కదిల్చి నన్ను లాక్కుంది. నన్ను, నా రొమ్ముని, నా మొహాన్ని, ఆత్మని, నడుముని! తన పెదవులమీద నా మొహాన్ని అదుముకుంది. అప్పటికీ నాకు నమ్మకం కాలేదు. నాకు తెలుసు ఆమె మనస్సు ఆమెకి తెలీదని. క్లోరోఫారం కింద స్త్రీని తెనాలి డాక్టరు చెరిచినట్టనిపించింది.

ఇప్పటికీ నా నమ్మకం-కాదు నాకు గట్టిగా తెలుసు - ఆమె యేమీ ఎరగదు. కాని కన్యగాని వ్యక్తురాలైన స్త్రీకి యెవరు నేర్పాలి ? ఆమె రక్తంలో జీవిస్తున్న ఆమె వంశపు స్త్రీలే ప్రోత్సహిస్తారు. బతికి వుండగా ఆమెని అడ్డగిస్తారు. చచ్చి ఆమెని వుద్రేకించి, జ్ఞానమిచ్చి ప్రోత్సహిస్తారు.

* * *

నిద్రపట్టిందో లేదో, మాకు చుట్టలదొర అరుపులు మెలుకువ తెప్పించాయి.

ఆమెని రొమ్ముమీద ముద్దు పెట్టుకుని లేపాను.

"ఏమిటోయ్ ఇంకా-"

"మీ అతను నీ కోసం వెతుకుతున్నాడు."

"వెతకనీ."

"వెతకనీ !!"

"ఇక్కడికి వస్తాడు" అన్నాను మళ్ళీ.

"రానీ."

"రానీ" అన్నాను నేనుకూడా వుత్సాహంగా.

కాని మళ్ళీ, "చూస్తాడు" అన్నాను.

"చూడనీ."

"చూడనీ" అన్నాను గొప్పగా.

"పడుకో యిట్లా."

నా తలని మెడకీ బుజానికీ మధ్య వొత్తుకుంది.

అన్నీ మరిచిపోయినాను. అతి శాంతంగా వుంది నా మనసూ. శరీరమూ, స్వర్గంలో ఆనందమూ, శాంతమూ అంటారే ఆ స్థితి యిదే గావును!

మళ్ళీ దొరకేక. స్టూడెంట్సు లేస్తున్నట్టున్నారు. చెపుతారు ఎక్కడ వున్నామో. కాని, నా ప్రియురాలు కదలనన్నాలేదు. నన్ను దగ్గిరగా, తనకి యింకా చేరువగా లాక్కుంది. సంకోచానికీ, సాహసానికీ కూడా స్త్రీ ముందు పురుషుడెందుకు?

"నవ్విట్లా పడుకో పెట్టుకుంటే, ఇట్లానే తెల్లారిందాకా నిద్రపోతాను."

"ఎందుకు నీ కాభయం?" అని నన్ను యెదురు అడిగింది. సాయంత్రంమంతా భయమని నా చేతుల్లోకి విద్యుల్లతవలె వాలిన ఆ పిల్ల ! పైగా ఆడవాళ్ళు పిరికివాళ్ళను కుంటారు మొగధీరులు. దొంగల్ని చూస్తే నాకు భయంలేదుగాని దొరల్ని చూస్తే భయం.

అప్పుడే కాదు. జీవితమంతా అంతే. ఆలోచించింది. నా చంపమీద కదిలేవేళ్ళు ఆమె ఆలోచనని నాకు తోపించాయి. నాలో అగ్ని శమించడంవల్ల ఆ వేళ్ళు నన్ను బాధించలేదు. చిన్నపిల్ల వేళ్ళవలె ఆహ్లాదాన్ని యిచ్చాయి.

చప్పున లేచి వెళ్ళింది. ఏదో కోపంతో మాట్లాడుతోంది. చరచరా వొచ్చింది. నన్ను ఆమాంతం యెత్తి గట్టిగా కావిలించుకుని, నా చేతిని తీసి మీదగా పెట్టుకుని పడుకుంది, ఏం చెప్పిందో ఆ చుట్టలదొరతో.

"నేనూ అతనూ పడుకున్నాము, నువ్వు ఆ వేపు వొచ్చావా, ఏమన్నా అన్నావా, నీ మూతిమీద తంతాను" అన్నదేమో అనుకుంటో హాయిగా లోకంలోకల్లా పరిమళంగల, మృదువైన దిండుమీద తల పెట్టుకుని నిద్రపోయినాను.

* * *

స్టూడెంటు నన్ను లేపుతున్నాడు, మెళుకువ రావటంలేదు.

"లేవండి సార్."

"దొంగలు లోపలికి వొచ్చారా?" అన్నాను కళ్ళు నులుముకుంటో.

నవ్వాడు.

"ఆమె బెల్టూ, పర్సూ మీ పక్కమీద వున్నాయట, కావాలంటోంది."

"ఎవరికి? ఏం పక్క?"

బైట యెండ తేజస్సు ఆ గుడి చీకటి మూలకికూడా పాకింది. నా పక్కమీద పూలు; ఓ మూల పర్సు, వీపుకింద ఆడవాళ్ళ బెల్టు! పక్కవంక చూస్తే చాలు కథ తెలుస్తుంది. ఏమనుకున్నారో వాళ్ళు!

పాపం! చప్పున సమయస్ఫూర్తి వహించాను.

"ఇదేమిటి? అల్లరిపిల్ల ! వెడుతో యివన్నీ నన్ను లేపడానికి మీద విసిరికొట్టి వెళ్ళింది గావును!"

అంటోనే వున్నానుగాని నా మనసు బాధపడుతోంది, ఒక్కమాట లేకండా. కడపటి ముద్దు అన్నా యివ్వకండా-

పోనీ తానే రాకూడదూ వీటికోసం ? లేచాను. బైట యెండ చక్కదనం రాళ్ళలోంచి ఆ మూలకి వస్తోంది. పొద్దెక్కింది బాగా.

"ఆమె యెక్కడ వున్నారు ?"

"బైట!"

ఆలోచిస్తున్నాను.

"తొరగా తెమ్మన్నారండి."

"ఏ మా తొందర ?"

"వెళ్ళిపోతున్నారు మోటారులో."

"మోటారు !!"

"బంగళానించి వొచ్చింది."

"దొంగలూ-"అన్నాను, కొనవూపిరితో.

దొంగలుపోతే-

"వెళ్ళి పోయినారు అప్పుడే"-నవ్వాడు.

నిజం నా మనసుకి తెలుసు. దొంగలతోనే ఆమె మాయమవుతుందని బైటికి నడిచాను.

మోటారులో ఆమె కూర్చుంది. ఓ కాలుకిందా, ఓ కాలు పైనా.

నోటిలో చుట్టతో నుంచున్నాడు దొర.

"గుడ్‌మార్నింగ్, గుడ్‌బై" అన్నాడు చెయ్యిచాచి స్నేహంగానే.

ఆమె మామూలుగానే చూస్తోంది నా వంక.

మోటారు సాగింది.

నా చెయ్యిచాచి ఆమె వేపు "గుడ్‌బై" అన్నాను.

ఆమె తన చేతిని చాచకుండానే "గుడ్‌బై" అంది.

మోటారు రాళ్ళ మలుపులో మాయమయింది.

ఆమె ఇండిఫరెన్స్ (indifference) తో నేను కుంగిపోయాను. ఆ కొత్త వుదయాన-లోకం నిస్సారంగా, అర్థవిహీనంగా కనబడ్డది. వారంరోజులవరకు నే నా దెబ్బ తట్టుకోలేదు.

ఆమె కన్నీళ్ళతో, బాధతో, నానించి పార్టు ఐతే, కొంచెం థాంక్‌ఫుల్‌గా సంతోషంతో గుడ్‌బై చెపితేనేం? నేను తనని వుండమని బలవంతం చేస్తానా, వెంటపడతానా? నేను చేసిన తప్పేమిటి ? ఇట్లాంటివే గడచిన పార్టింగ్స్ జ్ఞాపకం వొచ్చాయి. అవును, ఆడదానికే చాతనవును, ఈ నిమిషాన ఆ మనిషినే కక్కేసిన కళ్ళవలె చూడడం. మొగవాడు తిడతాడు, కొడతాడు, అసహ్యించుకుంటాడుగాని స్త్రీని తాను ఎరగనట్టే చూడడం చాతకాదు. నాగరికత. విద్యా ఎక్కువైనకొద్దీ, స్త్రీకి ఈ దొంగవేషాలు హృదయంలో కఠినతా ఎక్కువవుతున్నాయి, తమకి మెదడూ, నీతీ మాత్రమే వున్నట్టూ, శరీరమూ, ఆకలీ లేనట్టూ తాము మరచి, ఇతరుల్ని మరిపించి తిరగాలనుకుంటారు. తమ శరీరం కసి తీర్చుకున్నప్పుడు, ఆ పాపం మొగవాడి నెత్తిన చుట్టి ద్వేషిస్తారు.

"తరువాత?"

"ఏం లేదు. అంతే."

"మళ్ళీ ఆమె కనపళ్ళేదా?"

"ఎన్నాళ్ళకో, బెజవాడలో ఒకసారి"

"గుర్తించిందా ?"

"ఒకానొక గొప్ప ప్రభుత్వోద్యోగి బెజవాడ దర్శించినప్పుడు ఒకానొక వర్తక ప్రముఖుడు టీ పార్టీ యిచ్చాడు, అతి వైభవంగా, బాండు, బాణ సంచాతోసహా. దానికి నన్ను ఆహ్వానించారు. ఆ రోజుల్లో నన్ను ప్రతి పార్టీకి పిలిచేవారు. నా మీది గౌరవం చాతకాదు. నా కథలమీద గౌరవం చాతకాదు. వెళ్ళాను. పకోడీలు సయించనందువల్లనూ, మంచి టీ తాగడం అలవాటువల్లనూ, కేకులబల్ల దగ్గిరికి చేరాను. కేకులుతినే ఆశవల్ల కోడిగుడ్లు

వెయ్యలేదనీ, స్పెన్సర్‌లో బ్రాహ్మలచేత ప్రత్యేకం వండించేరనీ చెప్పుకు తినే ఖర్మం లేదు నాకు. అసలు అతిథి భార్యా సమేతంగా వొచ్చారు. ఆయన భార్య - నల్లపిల్ల !!! నా వంక ఆమె కళ్ళుపడ్డాయి. వులిక్కి పడ్డది. పలకరించ బోతోందనుకుని, చిరునవ్వును సాగించబోతున్నాను. చప్పున ఆమె పళ్లెంమీదికి కళ్ళువాల్చింది. నేను చిరునవ్వు గొంతులోకి నెట్టాను. పళ్ళెంలోని కేకును పొడిగా తుంచుతున్న ఆమె వేళ్ళ ఆతృత ఆమె మనసులో ఆరాటాన్ని నాకు తెలిపింది. ఆలోచించుకుని గావును మళ్ళీ మెల్లిగా కళ్లెత్తింది. నా వంక నిదానంగా చూసింది. ఆమె దృష్టులు నా కళ్ళలోకి టెలిగ్రాఫ్ కొడుతున్నాయి. నేత్రావధాన ప్రవీణుణ్ణి కావడంచేత సమాచారం సరిగా తీసుకున్నాను. ట్రెయినింగ్, బ్రీడింగ్-ఇవి మాత్రమే ఆ నిబ్బరాన్నీ, ఆ తెలివినీ యివ్వగలవు. ఆ నేత్రావధాన సందేశ మేమిటంటే.

"నన్ను పలకరించవొద్దు. పలకరించావా...." బెదిరించాయి కళ్ళు.

అంగీకరించి, సిగ్గుపడి, తలవొంచుకొని, లేచిపోయినాను, పకోడీల బల్ల దగ్గిరికి, హృదయంలోని ఆరాటాన్ని భరించలేక.

"ఎందుకు భయపడ్డావు? పలకరించవలసింది"

"ఆమెనా? ఆఁ, సాధారణ స్త్రీలు నన్ను మరిచిపో దలచి కొత్త మొహాలు పెట్టినప్పుడే, లాభంలేదని, నిష్క్రమణ చెందేవాణ్ణే! ఆమెనా! ఆ భర్తకి జీతమెంతో తెలుసునా? నన్ను ఆమె "ఎవరు?" అని కోపంతో కళ్లెత్తిందా? నేనూ హంపీకూడా భస్మమౌతాయి. అబ్బాయ్, ఒకటేమాట! యే పుణ్యకర్మవల్లనో యిల్లాంటి అదృష్టాలు తటస్థిస్తాయి. అంతటి కంతేనని తృప్తిపడి దేవతల్ని స్తుతించు. అంతేగాని, అదేదో సౌందర్యంవల్ల, ప్రతిభవల్ల నువ్వు సంపాయించు కున్నావనుకుని, గడచిన అదృష్టాన్ని సాగదియ్యాలని చూచావా, స్త్రీలేకాదు దేవతలుకూడా కళ్లెర్ర చేస్తారు.

◆ ◆ ◆

*ప్రచురణ : (హంపీకన్యలు కథల సంపుటి) ఎమెస్కో, 1969*